రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	శనివారం	ఆదివారం
కర్నూలు	6:34	4:58
నంద్యాల	6:31	4:59

హాలహర్వి మండలం హర్దగేరిలో నీటి కుంటను తవ్వుతున్న కూలీలు





25 వేల నీటి కుంటలు

భూగర్భ జలాలు పెరిగితేనే తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. భూమిలో తేమ శాతం సంరక్షించాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ క్షేత్రాల్లో నీటి కుంటలు (ఫారంపాండ్స్) తవ్వకాలు శ్రీకారం చుట్టింది. అన్నదాతల్లో చైతన్యం కలిగించి ప్రతి పంచాయతీలో పదికి తగ్గకుండా రాష్ట్రంలో రెండు లక్షల నీటికుంటలు తవ్వాలనే లక్ష్యం పెట్టుకున్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఫారంపాండ్స్ తవ్వకాల కోసం రైతులను ప్రోత్సహించింది. తద్వారా కూలీలకు ఉన్న ఊళ్లోనే వంద రోజులు పని దినాలు కల్పించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిర్లక్ష్యం చేశారు. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఉపాధి హామీ పథకం నిధులతో నీటి కుంటల తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలో 25 వేల నీటి కుంటలు తవ్వడం లక్ష్యం.

- ఉపాధి పనులతో జిల్లాలో నీటి సమస్య పరిష్కారానికి ప్రణాళిక
- రాష్ట్రంలో 2 లక్షల నీటి కుంటలు లక్ష్యం
- ప్రతి పంచాయతీలో పది ఫారం పాండ్స్
- ఉద్యమంగా చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- నేడు పూడిచెర్లలో ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కర్నూలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 808 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్‌జీఎస్) అమలులో భాగంగా 6.25 లక్షలకు పైగా జాబ్ కార్డులు జారీ చేశారు. అందులో పనులకు హాజరయ్యే యాక్టివ్ జాబ్ కార్డులు 5.75 లక్షల వరకు ఉన్నాయని డ్వామా రికార్డులు ద్వారా తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1.68 కోట్ల పని దినాలు కల్పించాలని లక్ష్యం. పంట కాలువలు పూడికతీత, ఊట కుంటలు, సరిహద్దు కందకాలు, గోకులాలు, సోక్ పిట్స్, చెరువులు, కుంటలు నవీకరణ.. వంటి పనులు ద్వారా కర్నూలు జిల్లాలో కూలీల వేతనాలు (లేబర్ బడ్జెట్) రూ.231.55 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కోసం రూ.73.08 కోట్లు ఖర్చు చేశారు. నంద్యాల జిల్లాలో కూలీల వేతనాలు కోసం రూ.167.69 కోట్లు, సామగ్రి కోసం రూ.55.01 కోట్లు ఖర్చు చేశారు. రైతు పొలాల్లో నీటి కుంటలు (ఫారంపాండ్స్) తవ్వకాలు చేయడం వల్ల భూగర్భ జలాలు పెంచడంతో పాటు భూమిలో తేమ శాతం, పశువులకు తాగునీరు, పంటలకు పురుగు మందులు పిచికారి నీరు అందుబాటులో ఉంటుంది. దీంతో రైతులను చైతన్యపరిచి రాష్ట్ర వ్యాప్తంగా ఓ ఉద్యమంలా ఈ కార్యక్రమం చేపట్టనున్నారు.

మద్దికెర మండలం ఎం అగ్రహారంలో ఉపాధి కూలీలతో నీటాకుంట తవ్వకాలు



ఉమ్మడి జిల్లాలో 25 వేలు నీటి కుంటలు

రైతులల్లో చైతన్యం కలిగించి రాష్ట్రంలో 2 లక్షల నీటి కుంటలు తవ్వాలని డ్వామా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో నెలకు 10 ఫారంపాండ్స్ చొప్పున మూడు నెలల్లో 30 తవ్వాలని లక్ష్యం. ఉమ్మడి జిల్లాలో 808 పంచాయతీలు, మజరా గ్రామాల్లో దాదాపు 25 వేల నీటి కుంటలు తవ్వకానికి లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. వీటి కోసం సుమారుగా రూ.93-95 కోట్లు ఖర్చ చేయనున్నారు. దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ జల ప్రయోజనాలు కలిగించేలా రైతు పొలాల్లో 8 మీటర్లు వెడల్పు, 8 మీటర్లు పొడవు, 2 మీటర్లు లోతుతో 128 చదరపు మీటర్లు ఫారంపాండ్స్ తవ్వకానికి రూ.38,400 ఉపాధి హామీ నిధులు ఖర్చు చేయనున్నారు. రైతు ఆసక్తి ఉంటే 25 మీటర్లు పొడవు, 25 మీటర్లు వెడల్పు, 2 మీటర్లు లోతుతో 1,250 చదరపు మీటర్లతో ఫారంపాండ్ తవ్వుకుంటే రూ.3.75 లక్షలు ప్రభుత్వ వెచ్చిస్తుంది. బోరుబావులు తగ్గరలో నీటికుంటలు తవ్వుకుంటే బోర్లలో నీటిఊట పెరిగి సాగునీటి తీరుతాయని డ్వామా అధికారులు పేర్కొంటున్నారు.

పూడిచెర్లలో ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్

రాష్ట్ర వ్యాప్తంగా నీటి కుంటలు తవ్వకాన్ని సీఎం చంద్రబాబు ప్రభుత్వం నీటికుంటలు తవ్వకాన్ని ఉద్యమంలా చేపట్టింది. గ్రామీణాభివృద్ధి శాఖను చూస్తున్న డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ శనివారం (నేడు) ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో రైతు సూర రాజన్న పొలంలో గడ్డపార చేపట్టి నీటి కుంట తవ్వకం పనులకు శ్రీకారం చుడతారు. కలెక్టరు పి. రంజిత్‌బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేతృత్వంలో పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు.

మిగతా 6వ పేజీలో

నేడు ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా

- హాజరు కానున్న కలెక్టర్, ఎస్పీ, పాణ్యం ఎమ్మెల్యే



కర్నూలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి యాజమాన్యం పాఠకుల కోసం కార్ అండ్ బైక్ రేస్‌ను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లా (కర్నూలు యూనిట్) స్థాయిలో విజేతల ఎంపిక కోసం లక్కీ డ్రా శనివారం ఆంధ్రజ్యోతి కర్నూలు యూనిట్ కార్యాలయంలో ఉంటుంది. కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ముఖ్యఅతిథులుగా హాజరై లక్కీడ్రా ద్వారా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతో పాటు వందమంది ప్రోత్సాహక బహుమతులు విజేతలకు ఎంపిక చేస్తారు. 2024 నవంబరు నుంచి 2025 ఫిబ్రవరి వరకు ప్రతి నెలా మూడు చొప్పున నాలుగు నెలలకు 12 కూపన్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించారు. ఒక్కో నెల కూపన్లు ఒక సెట్టుగా.. నాలుగు నెలలకు నాలుగు సెట్లు కూపన్లు పాఠకులు గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని ఇండస్ స్కూల్ దగ్గర ఉన్న ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయానికి దాదాపు 10వేలకు పైగా పాఠకులు కూపన్లు పంపించారు. ఉమ్మడి జిల్లాలో మొదటి బహుమతి బైక్, ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతి కలర్ టీవీ, వంద మందికి కన్సోలేషన్ బహుమతులు ఇస్తారు. అలాగే త్వరలో నిర్వహించే ఏపీ రాష్ట్ర స్థాయి లక్కీడ్రాలో బంపర్ బహుమతిగా కారు గెలుచుకునే అవకాశం ఉందని బ్రాంచ్ మేనేజర్ ఎ.లక్ష్మణ్, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'పది' పరీక్షలకు 293 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు శుక్రవారం జిల్లాలో మొత్తం 31,686 మంది విద్యార్థులకు గానూ 31,393 మంది హాజరు కాగా, 293 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరీక్షల పరిశీలకుడు అబ్రహాం ఒక పరీక్ష కేంద్రాన్ని, జిల్లా విద్యాశాఖ అధికారి ఆరు పరీక్ష కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ చంద్రభూషణ్ మూడు పరీక్ష కేంద్రాలతో పాటు అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్స్ 42, సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించినట్లు డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. ఓపెన్ స్కూల్ పరీక్షలకు జిల్లాలో 821 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 728 మంది పరీక్షలకు హాజరయ్యారు. 93 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి

ఓర్వకల్లు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిచెర్ల బస్ స్టేజీ సమీపాన రైతు సూర్య రాజన్న పొలంలో ఫారం పాండ్స్ భూమి పూజ కార్యక్రమానికి శనివారం రానున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫారం పాండ్స్ భూమి పూజ చేసిన సమీపాన బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు దాదాపు 6వేల నుంచి 8వేల మంది దాకా ప్రజలు వచ్చే అవకాశం ఉంది. డిప్యూటీ సీఎం రాక సందర్భంగా 500 మంది పోలీసులను గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో దిగి అక్కడి నుంచి సభా స్థలానికి వాహనాల ద్వారా రానున్న సందర్భంగా రోడ్డు వెంట భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వచ్చే వాహనాలు కూడా పార్కింగ్ ఏర్పాటు చేశారు.



వేదిక ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మధ్యవర్తిత్వంపై ముగిసిన శిక్షణ

కర్నూలు లీగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీ నుంచి శుక్రవారం వరకు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు, అన్ని జిల్లా కోర్టులలో మధ్యవర్తిత్వాన్ని ప్రవేశపెట్టడానికి నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. మధ్యవర్తిత్వం నిర్వహించడానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలకు చెందిన న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లకు 40 గంటల పాటు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కేరళకు చెందిన శిక్షకులు సురేష్, జ్యోతిగోపినాథన్ పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

పీఠం కోసం పోటీ

- ఆదోని మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం..!
- బీజేపీ వైపు 15 మంది వైసీపీ కౌన్సిలర్ల చూపు
- విజయవాడ నుంచి చక్రం తిప్పుతున్న ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోని, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్‌పై వైసీపీకి చెందిన కౌన్సిలర్లు తీర్మానం చేయడానికి నిర్ణయించారు. రెండు రోజుల క్రితం చైర్‌పర్సన్‌ను దింపాలని కౌన్సిలర్లు సంతకాలు సేకరించి మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం సమర్పించారు. సంతకాల సేకరణ వినతిపత్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు తేదీని విడుదల చేస్తామని చెప్పారు. ఆదోని మున్సిపాలిటీలో 42 వార్డులను కౌన్సిలర్లు ఉండగా అందులో ఒక స్థానాన్ని టీడీపీ గెలుపొందగా మిగతా 41 స్థానాల్లో వైసీపీ కైవసం చేసుకుంది.

ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్ల విముఖత

వైసీపీ నుంచి విజయం సాధించిన శాంత గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్ నేతృత్వంలో చైర్‌పర్సన్‌గా స్థానిక కౌన్సిలర్లు మద్దతుతో పదవీ బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి మూడేళ్లపాటు బాగానే ఉన్నా కూటమి ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజు నుంచి బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథితో కలిసి ఉంటున్నారని, చైర్‌పర్సన్ శాంత భర్త సింహం నాగేంద్ర బీజేపీలో చేరడం వంటివి చోటు చేసుకోవడంతో వైసీపీ మెజార్టీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అభియోగాలు మోపుతూ కౌన్సిలర్లు నిరసనలు చేసేవారు. పలు సమావేశాల్లో కౌన్సిలర్లు విధానాన్ని ఎండగడుతుండడంతో చైర్ పర్సన్ చాలా మార్లు కన్నీటి పర్యంతమైన సంఘటనలు ఉన్నాయి. అప్పటి నుంచి కౌన్సిలర్లు అందరినీ కలుపుకుపోవడం లేదని సొంత పార్టీ కౌన్సిలర్‌లు సైతం విస్మరించి సొంత నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ఇతర నేతలతో కుమ్మక్కై లావాదేవీలు జరిపినట్లు విశ్వసనీయ సమాచారం. అప్పటి నుంచి పార్టీలో ఉన్న కౌన్సిలర్లకు సైతం దూరంగా ఉంటూ చివరికి ఎమ్మెల్యే పార్థసారథితో వైసీపీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు కలిసిపోయారు. టీడీపీ కౌన్సిలర్‌తో కలుపుకుంటే కూటమి ప్రభుత్వానికి ఎనిమిది మంది కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన కౌన్సిలర్లు

ఒక వైపు చైర్‌పర్సన్ శాంతపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డితోపాటు మరో 33 మంది కౌన్సిలర్లు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ రంజిత్ బాషాకు అందజేశారు. వీరిలో కూడా 15 మంది బీజేపీ తీర్థం పుచ్చుకుంటున్నట్లు పట్టణంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. వారందరూ కూడా ఎమ్మెల్యే పార్థసారథికి టచ్‌లో ఉన్నారని, అవిశ్వాస తీర్మానం రోజు వారందరూ కూడా కూటమికి చెందిన చైర్‌పర్సన్‌కు మద్దతు తెలుపుతారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మరోవైపు నమ్మిన చోట అవిశ్వాసం తీర్మానంలో చైర్‌పర్సన్‌గా దించాలని చూడడం ఏమిటంటూ ప్రస్తుతం చైర్‌పర్సన్‌గా బోయ శాంత నిరసన తెలుపుతున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి విజయవాలోనే ఉంటూ అక్కడి నుండి కౌన్సిలర్లతో గోప్యంగా మాట్లాడుతున్నట్లు సమాచారం. ఏదేమైనా అవిశ్వాస తీర్మానం పెట్టాల్సిందే అంటూ మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, తన వైసీపీ తన కౌన్సిలర్‌లతో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆదోని రాజకీయ రసవత్తరంగా మారుతుందనడంతో ఎలాంటి సందేహం లేదు.



ఆదోని మున్సిపల్ కార్యాలయం

నేడు హైకోర్టు న్యాయమూర్తుల రాక

కర్నూలు లీగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బార్ అసోసియేషన్ వార్షిక సమావేశంలో పాల్గొనడానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు నలుగురు శనివారం కర్నూలుకు రానున్నట్లు కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి. కృష్ణమూర్తి, బీఎస్ రవికాంత్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో శనివారం సాయంత్రం జరిగే న్యాయవాదుల వార్షికోత్సవ సమావేశానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ కే. శ్రీనివాసరెడ్డి, జస్టిస్ ఎన్. హరినాథ్, జస్టిస్ ఏ. హరిహరనాథ శర్మ రానున్నట్లు వారు ఆ ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి హాజరవుతారని చెప్పారు.



జలమే జగతికి రక్ష

- నీటి సంరక్షణ మనందరి బాధ్యత
- నీటి వృథాను అరికడదాం.. భావితరాలకు భవితనిద్దాం
- నేడు ప్రపంచ జల దినోత్సవం

మానవాళి మనుగడలో నీరు కీలకం. నీరు లేని చోట జీవరాసుల మనుగడ దుర్లభం. జలాన్ని సంరక్షిస్తేనే.. మనం సురక్షితం.. అయినా మనం నీరు వృథా చేస్తుంటాం. భూమిపై నీటి ప్రాధాన్యతను గుర్తింపచేయడానికి ఏటా ప్రపంచ జల దినోత్సవాన్ని మార్చి 22వ తేదిన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తొలుత రియోడి జనీరో బ్రెజిల్‌లో పర్యావరణ అభివృద్ధిపై 1992లో ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రతిపాదించారు. ఐరాసలో మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు ప్రపంచ జల దినోత్సవాన్ని మార్చి 22వ తేదీన నిర్వహించేలా ఐరాస నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది హిమపాతాన్ని సంరక్షించాలని పిలుపునిచ్చింది.



ఆత్మకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వర్షపునీటిని భూగర్భంలోకి ఇంకించాలి. చుక్కనీరు కూడా వృథా కాకుండా ఒడిసిపట్టి అవసరం ఉన్నప్పుడు వినియోగించుకునేలా ప్రతి ఇంట్లో నీటి ట్యాంకులను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలు తప్పనిసరి. సాగు కోసం సేద్యపు కందకాలు తవ్వించాలి. ఇందుకు ప్రభుత్వం సైతం రాయితీని అందిస్తోంది. ప్రత్యేకించి జలశక్తి అభియాన్ కింద చెరువుల్లో పూడికతీత, ఊట కుంటలు, చిన్నకుంటల నిర్మాణం, పంటకాల్వలు, గ్రామాల్లో సామాజిక ఇంకుడు గుంతలు, నీటి నిల్వ కుంటలు, చెక్‌డ్యాముల్లో పూడిక పనులు, రోడ్లకు ఇరువైపుల మొక్కల పెంపకం, పొలం, కాల్వ గట్ల వెంట మొక్కల పెంపకానికి ప్రోత్సహిస్తోంది. అంతేకాదు ఉపాధి హామీ పథకం ద్వారా కూడా ఈ పనులను చేపట్టే వెసులుబాటు ఉంది.



నీటి వృథాను అరికట్టేందుకు దోహదపడే చెక్‌డ్యామ్

శరీరంలో నీటి శాతం తక్కువైతే తలెత్తే ప్రమాదం

- డీహైడ్రేషన్ కలుగుతుంది. మలబద్ధకం పెరుగుతుంది. తలనొప్పి, తల తిరగడం, అలసట, ఆందోళన కలిగే అవకాశం వుంది.
- మూత్రవిసర్జన తగ్గుతుంది. కొన్ని పరిస్థితులు మాత్రం అగిపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల అనేక వ్యాధులు వస్తాయి. కండరాల నొప్పులు, బలహీనతలు ఏర్పడవచ్చు. చేతులు, కాళ్లు చల్లబడవచ్చు.
- వయస్సు పెరిగే కొద్ది దాహం తగ్గుతుంది. నీరు తాగాలని అనిపించకపోయినా.. తగినంత నీరు తాగడం మంచిది. లేనిపక్షంలో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి.
- రక్తపోటు, ఆస్థమా, విపరీతమైన శారీరక నొప్పులు వస్తాయి.
- నీటి వల్ల డయేరియా, టైఫాయిడ్, డిసెంట్రీ, అమిబియసిస్, కలరా వ్యాధులు సంభవించే ప్రమాదం వుంది.



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న జనం

నీళ్లు.. నిజాలు :

వేసవి వస్తోందంటేనే జనంలో భయం మొదలవుతుంది. బిందెలతో బారులు తీరే జనం కనిపిస్తారు. నేలతల్లి నెర్రలిచ్చి కరువు కష్టాలను ప్రతిబింబిస్తుంటే గుక్కెడు నీటి కోసం మైళ్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా నీటి కోసం అనేక దేశాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఆ వివరాలను పరిశీలిస్తే ఆశ్చర్యానికి గురికావాల్సి ఉంటుంది.

- ప్రపంచంలో 80దేశాలు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నాయి.
- భూమండలం మీద లభించే నీటిలో ఉప్పు సముద్రాల వాటా 97శాతం, 2.92శాతం హిమపాతం, కేవలం 0.08 మాత్రమే స్వచ్ఛమైన నీరు వుంది.
- ప్రపంచవ్యాప్తంగా 3.575 మిలియన్ల జనం ప్రతి సంవత్సరం నీటి సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నారు.
- నీటిమూలంగా సంభవించిన 43శాతం మరణాలు అతిసార వ్యాధే కారణం. ఈ మరణాలు కూడా 84శాతం 14ఏళ్ల లోపు చిన్నారులకే సంభవిస్తున్నాయి.
- 98శాతం మరణాలు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే జరుగుతున్నాయి.
- భూమి మీదున్న నీటిలో ఒక్క శాతానికంటే తక్కువ మొత్తం నీళ్లను మాత్రమే మానవాళి వినియోగించుకుంటున్నారు.
- భూమిపై ప్రతి 15 సెకన్లకు ఒకరు నీటి సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నట్లు అంతర్జాతీయ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

నీటిని సంరక్షించుకోవడం మనందరి బాధ్యత



నీటిని సంరక్షించుకోవడం మనందరి బాధ్యత. వర్షపునీటిని ఒడిసిపట్టే విధంగా వీలైనంత వరకు ఇంగుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి. అలాగే కుళాయిల నుంచి నీరు వృథా జరగకుండా చూసుకోవాలి. ఎక్కడైనా పబ్లిక్ కుళాయిల నుంచి నీరు వృథా అవుతోంటే మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఇంట్లో వినియోగించుకున్న నీరు ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా చూసుకోవాలి.

- రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు



నీటి కుంటలు

మనం తాగే నీరు మంచివేనా..?

వాస్తవానికి ఇటీవల కాలంలో జనం తాగేనీరు మంచివేనా..? అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. గ్రామాల్లో ఆర్‌డబ్ల్యుఎస్, పట్టణాలు, నగరాల్లో మున్సిపాలిటీల ద్వారా అందుతున్న జలం శుద్ధమేనా..? అన్న సందేహం తలెత్తుతోంది. ప్రత్యేకించి పట్టణాలు, నగరాలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, ఇతర నీటి వనరుల నుంచి సరఫరా చేస్తున్నాయి. అయితే వచ్చే నీరు సక్రమంగా శుద్ధి జరగడం లేదని తెలుస్తోంది. అందుకే చాలా చోట్ల ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లు, మినరల్ వాటర్ ప్లాంట్ల వద్ద నుంచి నీరు కొంటున్నారు. కానీ ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్లు కూడా నిర్దిష్టమైన ప్రమాణాలు పాటించడం లేదని తెలుస్తోంది. నీటిని క్రమపద్ధతిలో శుద్ధి చేయకుండా విక్రయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఆత్మకూరులోని ఓ వాటర్ ప్లాంట్‌లో బ్యాక్టీరియా చేరినట్లు నిర్ధారణ అయింది. ఇది తెలియని కాలనీవాసులు అదే నీరు తాగాల్సి వచ్చింది. విషయాన్ని గుర్తించిన మున్సిపల్ అధికారులు వెంటనే ప్లాంట్‌ను సీజ్ చేశారు.

కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం అభినందన

కర్నూలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో కర్నూలు జిల్లాలో 119.70 కిలోమీటర్లకుగాను 116.72 కిలోమీటర్లు పూర్తి చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండటంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలెక్టర్ రంజిత్ బాషాను అభినందించారు. శుక్రవారం విజయవాడ కార్యాలయం నుంచి ఫారంపాండ్స్ ఏర్పాట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల పురోగతి, గోకులాల నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై కలెక్టర్లతో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గోకులాల నిర్మాణాలకు సంబంధించి కర్నూలు జిల్లాలో 1200 లక్ష్యానికి గానూ 664 పూర్తి చేశామని కలెక్టర్ వివరించారు. రోడ్లు లేని గ్రామాలు జిల్లాలో 21 ఉన్నాయని, అందులో 17 కోట్లతో 11 గ్రామాల్లో రోడ్ల పనులు మొదలు పెట్టామని తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముక కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ధాన్యం కొనుగోళ్లకు ఎట్టకేలకు కర్నూలు మార్కెట్ యార్డులో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కర్నూలు మార్కెటింగ్ శాఖ జేడీ, కర్నూలు మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జి రామాంజనేయులు మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ధాన్యం (వడ్లు)ను మిల్లర్లకు విక్రయించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి ప్రతి రోజూ యార్డులో ధాన్యం కొనుగోలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఇప్పటి దాకా మిల్లర్ల వద్ద తమ ధాన్యాన్ని అమ్మేందుకు రైతులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని, ఇక ఆ పరిస్థితులు ఉండవని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరకుతుందని, ఈ అవకాశాన్ని ధాన్యం పండిస్తున్న రైతులంతా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు నాగేష్, కేశవరెడ్డి, శివన్న, మిల్లర్లు, కార్మికుల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు శేషగిరి శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

అత్తరు గుబాళింపుల రంజాన్



- జోరుగా సాగుతున్న అత్తర్ల వ్యాపారం
- కొనుగోలుదారులతో కళకళలాడుతున్న దుకాణాలు

కర్నూలు కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) రంజాన్ మాసం వచ్చిదంటే కర్నూలు పాత నగరం అత్తరు గుబాళింపులు వెదజల్లుతుంటుంది. ఈ మాసంలో విరివిగా విభిన్న రకాల అత్తర్లు అందుబాటులోకి వస్తాయి. వాటి కొనుగోళ్లు జోరుగా సాగుతుంటాయి. ముస్లింలతోపాటు ముస్లిమేతరులు కూడా సువాసనా భరితమైన అత్తర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. పార్టీలు, ఫంక్షన్లలో ఆకర్షణీయమైన దుస్తులపై పరిమళాలు వెదజల్లే అత్తర్లను రాసుకోవడం అన్ని వర్గాల వారూ ఆసక్తి కనబరుస్తారు. దీంతో ఈ మాసంలో ప్రత్యేకంగా లభించే అత్తర్ల కోసం కొనుగోలుదారులతో ఈ దుకాణాలన్నీ కళకళలాడుతున్నాయి. రంజాన్ మాసం సందర్భంగా వ్యాపారులు ఈ మాసంలో ప్రత్యేకంగా లభించే అత్తర్లను దుబాయి, మస్కట్, కువైట్ తదితర ఎడారి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అత్తర్లలోనూ నిత్యం వినియోగించుకునే వాటితోపాటు ప్రత్యేక ఫంక్షన్ల సమయంలో వినియోగించేవి వేర్వేరుగా ఉంటున్నాయి. ఇక మహిళలకు ప్రత్యేకమైన సువాసనలు వెదజల్లేవి కొన్నైతే, మగవారి కోసం మరికొన్ని అందుబాటులో ఉంటున్నాయి.



మనసుకు హాయిగొలిపే అత్తరు పరిమళం...

మల్లెపూలు, గులాబీపూలు, గంధపు చెక్కలు, మొగలి పువ్వులు ఇలా అనేక పూల పరిమళాలతో మనసుకు హాయిగొలిపే అత్తర్లు మార్కెట్లో లభిస్తున్నాయి. అత్తరు ఎంత ఎక్కువ కాలం భద్రపరిస్తే అంత సువాసనను వెదజల్లుతుంది. కొన్ని అత్తర్లు దుస్తులకు రాసాక కూడా వాటిని ఉతికినా సువాసన అలాగే ఉంటుంది. అలాంటివే అసలు సిసలైన అత్తర్లుగా చెప్పవచ్చు. అత్తర్లలోనూ అనేక రకాలు ఉన్నాయి. ఇవి పడని వారికి శ్వాస ఇబ్బంది కలుగుతుంది. అందుకే తమకు నచ్చిన వాటినే ఎంపిక చేసుకోవాలని వ్యాపారులు సూచిస్తుంటారు. ఇక వేసవిలో ఖాస్, ఇత్రేగిల్ అత్తర్లు చల్లదనాన్ని ఇస్తాయి. చలి, వర్షాకాలంలో షమామతుల్, హీనా, జాఫ్రాన్, దహనల్ ఊద్ వంటివి వెచ్చదనాన్ని ఇస్తాయి. అలాగే రంజాన్ సీజన్‌లో జన్నతుల్ ఫిర్దోస్, మజ్మ, షాజాన్, మన్నా, నాయబ్, హోప్, బకూర్, మొకల్లత్, దహనుల్ ఊద్ వంటివి లభిస్తున్నాయి.



అన్ని కాలాలకు అనుగుణంగా యువత ఆసక్తి...

అన్ని కాలాలకు అనుగుణంగా ఉన్న అత్తర్లు, పర్‌ఫ్యూమ్స్‌పై యువత ఆసక్తి చూపిస్తున్నారు. రంజాన్ మాసంలో అటు అత్తర్లతోపాటూ ఇటు విభిన్న రకాల పర్‌ఫ్యూమ్స్ కూడా జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. ఒకప్పుడు వేసవి కాలంలో శరీరానికి చెమట దుర్గంధం రాకుండా చాలా మంది పర్‌ఫ్యూమ్‌లు వాడేవారు. కానీ ప్రస్తుత కాలంలో అన్ని సీజన్లలో వినియోగించే రకాలు మార్కెట్లో అందుబాటులోకి వచ్చేశాయి. యువత శరీరానికి వినియోగించే డియోడరిండ్లు, పర్‌ఫ్యూమ్‌లు, దుస్తులకు రాసుకునే అత్తర్లు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు.



రంజాన్ మాసంలో ప్రత్యేక అమ్మకాలు...

అనేక రకాల బ్రాండ్ల అత్తర్లు ఈ మాసంలో విక్రయిస్తున్నాం. యువత, మహిళలు, మగవారికి వేటికవే ప్రత్యేకంగా లభిస్తున్నాయి. ఒక బ్రాండ్‌కు అలవాటు పడినవారు తిరిగి వేరే బ్రాండ్లపై ఆసక్తి చూపించరు. అందుకే వారికోసం ప్రత్యేకంగా తెప్పించి అమ్మకాలు చేస్తున్నాం. రూ.50 మొద లు రూ.8వేల వరకు అత్తర్లు ఖరీదు ఉంటున్నాయి.

- మహమ్మద్ యూసటఫ్, వ్యాపారి, పాతనగరం

తహసీల్దార్ల పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న 267 తహసీల్దార్ల పోస్టులను భర్తీ చేయాలని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు తీర్పునకు లోబడి రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న తహసీల్దార్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చిన ఏకైక సీఎం చంద్రబాబే అని కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం జనవరిలో 1,033 కోట్లు చెల్లించిందన్నారు. రెండు మూడు రోజుల్లో మిగతా బకాయిలు 6,200 కోట్లు చెల్లిస్తున్న సందర్భంగా కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ, వార్డు సచివాలయం క్రమబద్ధీకరణలో భాగంగా ప్రతి సచివాలయానికి ఒక వీఆర్వో కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం త్వరలో పీఆర్సీ కమిషన్ వేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మిరాజు, మిలా విభాగం చైర్మన్ సెహేరాబాను, వైస్ చైర్మన్ మద్దిలేటి, ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, లోకేశ్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

(5వ పేజీ తరువాయి)

25 వేల నీటి కుంటలు

ఉదయం 9.45 గంటలకు కర్నూలు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి (ఓర్వకల్లు) విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి రోడ్డు మార్గంలో పూడిచెర్లకు చేరుకుంటారు. 10.10 గంటలకు ఫారంపాండ్ పనులను ప్రారంభిస్తారు. అనంతరం ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకొని 11.45 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళ్తారు.

పవన్ సార్.. వీటిపై దృష్టి సారించండి:

- ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు జనవరి నుంచి ఇప్పటి వరకు దాదాపు మూడు నెలలుగా వేతనాలు అందలేదు. కూలీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవతున్నారు. ఉపాధి పనులకు వెళితే సకాలంలో కూలీ డబ్బులు రావడంతో లేదని ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. కర్నూలు జిల్లాలో దాదాపు రూ.25-30 కోట్లు వరకు బకాయి ఉందని తెలుస్తుంది. నంద్యాల జిల్లాలో కూడా రూ.16-18 కోట్లు బకాయి ఉందని అధికారులే అంటున్నారు. తక్షణమే కూలీ డబ్బులు చెల్లించాలి.
- పల్లె పండుగ కార్యక్రంలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.67.58 కోట్లతో 830 సీసీ రోడ్లు నిర్మాణాలు చేపడితే 792 పూర్తి చేశారు. దాదాపు రూ.40 కోట్లకు పైగా బిల్లులు బకాయి ఉన్నాయి. నంద్యాల జిల్లాలో రూ.85.12 కోట్లలో 1,093 సీసీ రోడ్ల పనులు చేపట్టి 945 పనులు పూర్తి చేశారు. 145 పనులు పురోగతిలో ఉన్నాయి. ఇక్కడ కూడా బిల్లులు అందక పనులు చేసిన కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు.
- పశుపోషణ ఆధారంగా జీవనం సాగిస్తున్న రైతులకు ఉపాధి హామీ పథకం నిధులతో గోకులం షెడ్లు నిర్మిస్తారంటే.. ఉత్సాహంతో రైతులు ముందుకు వచ్చారు. కర్నూలు జిల్లాలో రూ.21.92 కోట్లతో 959 గోకులం షెడ్లు మంజూరు చేశారు. రూ.9.76 కోట్లు ఖర్చు చేసి 651 షెడ్లు నిర్మాణం పూర్తి చేశారు. నంద్యాల జిల్లాలో రూ.19.61 కోట్లతో 854 గోకులం షెడ్లు మంజూరు చేస్తే.. 529 షెడ్లు పనులు పూర్తయ్యాయి. 325 షెడ్లు పురోగతిలో ఉన్నాయి. వీటికి కూడా బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి నిర్మంచుకున్న రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి బకాయి నిధులు విడుదల చేసి కూలీలు, రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. నేడు పూడిచర్లలో జరిగే ఫారంపాండ్స్ పనుల ప్రారంభోత్సవం సభలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరుతున్నారు.



దేవనకొండ మండలం కొత్తపల్లిలో రైతు పొలంలో తవ్వుకొన్న ఫారంపాండ్

స్ట్రాంగ్ రూమ్ తనిఖీ



తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్ మోహన్‌రావు తనిఖీ చేశారు. జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీలో 2024-25లో జరిగిన లావాదేవీలపై వార్షిక తనిఖీ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డీటీవో రామచంద్రరావు, అసిస్టెంట్ డీటీవో జయలక్ష్మి, ఎస్టీవో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌కు సతీ వియోగం


షహనాజ్ (ఫైల్)

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి షహనాజ్ (69) శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో అనారోగ్య ంతో కన్నుమూశారు. పవిత్ర శుక్రవారమే అంత్యక్రియలు చేయాలని పెద్దల నిర్ణయం మేరకు హైదరాబాద్‌లోనే అంత్య క్రియలు నిర్వహిం చారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఆళ్లగడ్డ, పాణ్యం, నందికొట్కూరు, శ్రీశైలం ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గౌరుచరితా రెడ్డి, గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నంద్యాల, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, నంద్యాల నుంచి టీడీపీ నాయకులు, అభిమానులతో పాటు పలువురు హైదరాబాద్ వెళ్లి ఫరూక్‌ను పరామర్శించారు.

కర్నూలు అర్బన్: మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి షహనాజ్ మృతి పట్ల మంత్రి టీజీ భరత్, ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


కౌలుట్లయ్య (ఫైల్)

తుగ్గలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా తుగ్గలికి చెందిన కౌలుట్లయ్య (66) అప్పుల బాధతో శుక్రవారం పొలంలో ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివీ.. కౌలుట్లయ్య సొంత పొలం ఆరెకరాలతో పాటు మరో 12 ఎకరాలు కౌలుకు చేసుకుని వ్యవసాయం చేస్తున్నారు. మూడేళ్ల నుంచి కంది, ఉల్లి పంటలు సాగు చేసి దాదాపు రూ.10 లక్షలు అప్పు చేశారు. అప్పు తీర్చే మార్గం లేదని మనస్తాపం చెంది పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు, రైతులు హుటాహుటిన అంబులెన్సులో తుగ్గలి వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక మృతి చెందారు. కౌలుట్లయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు లక్ష్మణ స్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అశోక్ (ఫైల్)

వెలుగోడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. వెలుగోడు మండలంలోని మోతు కూరు గ్రామానికి చెందిన అశోక్ (26) వెలుగోడు పట్టణంలో అపోలోఫార్మసీలో పని చేస్తున్నాడు. మోతుకూరు నుంచి ద్విచక్ర వాహనంపై వెలుగోడుకు బయలుదేరాడు. వెలుగోడు నుండి నంద్యాలకు బయలు దేరిన ట్రాలీ ఆటో బోయరేవుల మోతుకూరు గ్రామాల మధ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భారతి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ షాషావలి కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

ప్యాపిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగమర్రి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా వ్యవహరించిన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు బొజ్జన్నపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. పిల్లల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

వృద్ధురాలిపై అత్యాచారయత్నం

ఆత్మకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో శుక్రవారం దారుణ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు కల్లంలో మధ్యాహ్నం నిద్రిస్తుండగా ఓ వ్యక్తి ఫూటుగా మద్యం సేవించి ఆమెపై అత్యాచారం చేసే ప్రయత్నం చేశాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకో గానే అతడు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామస్థుల సమాచారంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేసినట్లయితే కేసు నమోదు చేస్తామని ఆత్మకూరు ఎస్సై నారాయణరెడ్డి తెలిపారు.

ఎల్లెల్సీలో మహిళ మృతదేహం

హొళగుంద, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎల్లెల్సీ దిగువ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గర్తించినట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరామ్ నాయక్ శుక్రవారం తెలిపారు. హొళగుంద గ్రామ శివారులోని బళ్లారి బ్రిడ్జ్ వద్ద ప్రవహిస్తున్న ఎల్లెల్సీలో మృత దేహం ఉన్న సమాచారం రావడంతో వెళ్లి మృతదేహాన్ని పరిశీలిం చినట్లు తెలిపారు. మృతురాలి ఒంటిపై ఎరుపు జాకెట్ ఉన్నట్లు తెలి పారు. కుడి చేతిపై ఎం రాజమ్మ అనే పేరున కన్నడ భాషలో పచ్చ బొట్టు ఉన్నట్లు తెలిపారు. ఆమె వయస్సు 30 నుండి 35 సంవత్స రాలు ఉంటుందని అన్నారు. గ్రామ సేవకుడు తలారి సిద్దలింగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

కేసీ కెనాల్‌లో అస్తిపంజరం

నంద్యాల క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పొన్నాపురంలో ప్రవహిస్తున్న కేసీ కెనాల్‌లో శుక్రవారం ఓ అస్తి పంజరం కొట్టుకుని వచ్చింది. సిమెంట్ సంచులతో నిండుగా కట్టి పడేసి, కాల్వలో కొట్టుకొని వస్తుంటే గుర్తు తెలియని మృతదేహంగా స్థానికులు గుర్తించారు. నంద్యాల తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని కేసీ కాల్వలోని ఆ సంచిని వెలికి తీశారు. తీరా చూస్తే అందులో మగ అస్తిపంజరం ఉండడంతో అవాక్కయ్యారు. ఎక్కడో హత్యచేసి మృతదేహాన్ని కట్టిపడేసి కాల్వలో పడేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. తాలూకా అర్బన్ సీఐ ఈశ్వరయ్య సమక్షంలో ఫోరెన్సిక్ ప్రొఫెసర్‌ను ఘటన స్థలానికి పిలి పించి అస్తిపంజరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్మికులు ఖననం చేశారు. పోస్టుమార్టం నివేదిక అనం తరం మరిన్ని విషయాలు విచారణలో వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

కంప్రెషర్ పేలి నలుగురికి గాయాలు

సి.బెళగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో నడిపి అక్బర్ అనే రైతు పొలంలో గుండ్లు తీయడానికి వాడిన కంప్రెషర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కంప్రెషర్ యజమాని రాజు శుక్రవారం అక్బర్‌కు చెందిన పొలంలో గుండ్లు తీస్తున్నాడు. వరుసగా మూడు ఘాతాలను వేసి పేల్చగా రెండు పేలాయి. మూడోది పేలక పోవడంతో శ్రీరాములు, విరాంజినేయులు, డోలుమద్ది దగ్గరకు వెళ్లి పరిశీలిస్తుండగా ఈ క్రమంలో అది పేలి ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా గాయాలైన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కంప్రెషర్ బండి యజమాని నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, తమ వాళ్లకు అనుభవం లేదని చెప్పినా వినకుండా తీసుకెళ్లాడని ఆరోపించారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

కర్నూలు న్యూసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24, 25 తేదీలలో జరగాల్సిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెను వాయిదా వేసినట్లు యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఇ.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మె నివారణ గురించి న్యూ ఢిల్లీలో సెంట్రల్ లేబర్ కమిషనర్ బ్యాంకు, కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు, బ్యాంకు యూనియన్ల ఐక్య వేదిక మధ్య జరిగిన సయోధ్యలో సానుకూలంగా డిమాండ్ల పరిష్కారానికి స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. సమ్మెను వచ్చే నెలకు వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బోర్డు తిప్పేసిన జనని

- లక్షాధికారులను చేస్తామని నట్టేట ముంచాడు
- నగలు, డబ్బుతో ఉడాయించిన మహిళా బ్యాంకు సీఈవో వెంకటరమణ
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు


జనని పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం


బాధితురాలు హరిప్రియ

కోవెలకుంట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జనని పరస్పర సహకార పరపతి సంఘం పేరుతో ఏర్పాటు చేసిన జనని మహిళా బ్యాంకు బోర్డు తిప్పేసింది. ఆ సంస్థ సీఈఓ వెంకటరమణ గత 20 రోజులుగా సెల్‌ఫోను స్విచ్ఛాఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లడంతో డిపాజిటర్లు గగ్గోలు పెడుతు న్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ మహిళలు ఒక్కొక్కరు రూ.లక్షల్లో సొమ్మును ఆ పరపతి సంఘంలో డిపాజిట్ చేయడంతో ఆ డబ్బు తిరిగి వస్తుందో రాదోనని వారిలో తీవ్ర ఆందోళన నెల కొంది. కొందరు మహిళలు సీఈవో స్వస్థలం కడపకు వెళ్లి అతని ఇంటి వద్ద ఆరా తీయగా సీఈవో ఆచూకీ లేకపోవడంతో వారికి నిరాశ మిగిలింది. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన హరిప్రియ అనే మహిళను బ్యాంకు ట్రెజరర్‌గా నియమిస్తున్నామని చెప్పి నమ్మ బలికి ఆమె నుంచి ఎనిమిదిన్నర తులాల బంగారు, ఐదు లక్షల నగదు తీసుకున్నారు. బంగారు లాకరులో ఉంచుతామని చెప్పి అధిక వడ్డీ పేరుతో మోసం చేశాడని హరిప్రియ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగి సముద్రాల బాలసుబ్బయ్య ఈ సంస్థలో ఆరు లక్షలు డిపాజిట్ చేశాడు. బాండ్లు మెచ్యూర్ కావడంతో అతనికి వడ్డీతో కలిపి సుమారు రూ.7.40 లక్షలు రావాల్సి ఉంది. జననీ బ్యాంకు సిబ్బంది బాలసుబ్బయ్యకు చెక్ ఇచ్చారు. నగదు డ్రా చేసుకునేందుకు అతనికి సేవింగ్ ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లగా జననీ మహిళా బ్యాంకు ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయింది. మహిళా బ్యాంకు సీఈవో వెంకటరమణకు ఫోను చేయగా ఆఫోను స్విచ్ఛాఫ్ చేసి ఉండడం, 20 రోజుల నుంచి అందుబాటులో లేకపోవడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతు న్నారు. దీంతో డిపాజిటర్లు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జున రెడ్డి బ్యాంకు సిబ్బందిని పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారించగా వెంకటరమణ ఫోను స్విచ్ఛాఫ్ చేసి ఎస్కేప్ అయ్యాడని తెలిపారు. గత 20 రోజులుగా అందు బాటులో లేడని పోలీసులకు వివరించారు. తమను చూసి పట్టణానికి చెందిన ఎందరో మహి ళలు రూ.లక్షల్లో డిపాజిట్ చేశారని పరపతి సంఘం సెక్రటరీ పద్మావతి తెలిపారు.

ఎవరీ వెంకటరమణ



కడప పట్టణానికి చెందిన వెంకటరమణ స్థానికంగా ఉన్న పరిచయాలు ఆసరాగా చేసుకుని నం ద్యాల జిల్లాలో ఐదు బ్రాంచ్‌లు ఏర్పాటు చేశాడు. కోవెలకుంట్లతో పాటు చాగలమర్రి, బనగానపల్లె, నంద్యాల తదితర చోట్ల జననీ మ్యాక్స్ సంస్థ పేరుతో జననీ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం కార్యాలయాలు తెరిచాడు. ఆ సంస్థ ద్వారా డిపాజిట్లపై రూపాయి వడ్డీ ఆ డిపాజిట్‌కు నగదుపై రుణం తీసుకుంటే ఒకటిన్నర రూపాయి చొప్పున వడ్డీ తీసుకుంటూ నాలుగు సంవత్సరా లుగా ఈ సంస్థను నిర్వహిస్తున్నారు. వేలాది మంది మహిళల నుంచి సుమారు రూ.2కోట్ల మేర భారీ మొత్తంతో డిపాజిట్లు సేకరించినట్లు తెలిసింది. ఈ సంస్థలో డబ్బు పొదుపు చేసిన డిపాజిటర్లు ఆ కార్యాలయాల చుట్టూ తిరుగుతుండడంతో వారికి చెల్లించేందుకు నగదు అందుబాటులో లేకపోవ డంతో ఆ సంస్థలో పని చేస్తున్న సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. డిపాజిటర్ల నుంచి ఒత్తిడి అధికం కావడం, డిపాజిటర్లు పోలీసులను ఆశ్రయించడంతో సీఈవో వెంకటరమణ డిపాజిటర్ల నగదు, బంగారం స్వాహా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది.

ఆ ఐదుగురే..!

- సంజన్న హత్య కేసులో నిందితుల అరెస్టు
- ఆధిపత్య పోరు.. పాత కక్షలే కారణం



నిందితుల అరెస్టు చూపిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శరీన్‌నగర్‌లో సంచలనం సృష్టించిన కాశపోగు సంజన్న హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, సీఐలు మధుసూదన్‌గౌడు, శేషయ్యలు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిందితులు వడ్డె ఆంజనేయులు, ఆయన కుమారులు వడ్డె శివ, వడ్డె తులసి, వడ్డె రేవంత్, వీరి అనుచరుడు వడ్డె అశోక్‌లను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన నాలుగు వేటకొడవళ్లు, ఒక పిడి బాకు, ఆరు సెల్ ఫోన్లు, రెండు కట్టెలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ తెలిపిన మేరకు.. మృతుడు సంజన్న, కుటుంబ సభ్యులు, నిందితుడు ఆంజనే యులు కుటుంబ సభ్యుల మధ్య కొద్ది కాలంగా గొడవలు ఉన్నాయి. ఆధిపత్య కోసం ఒకరిపై ఒకరు పోటీ పడ్డారు. 2022లో కూడా వీరిద్దరు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకు న్నారు. ఈ నెల 14న ఉదయం ఇమ్రాన్ అనే వ్యక్తి వడ్డె ఆంజనేయులుతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఆంజనే యులు చొక్కా కాలర్ పట్టుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆంజనేయులు అందరూ తనను చులకనగా చూశారని, తాను అంటే భయం పోయిందని, సంజన్నను చూసే ఇదంతా చేస్తున్నారని కొడుకులతో వాపోయాడు. ఎలాగైనా సంజన్నను హతమార్చాలని ప్రణాళిక చేసుకు న్నారు. అదే రోజు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో కాశపోగు సంజన్న శరీన్‌నగర్‌లో ఉన్న మెడిటేషన్ సెంటర్‌కు రావడంతో అప్పటికే కాపు కాసిన వీరంతా సంజన్నపై దాడి చేసి హత్య చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి చాకచక్యంగా నిందితులను పట్టుకున్నారు. ఆంజనేయులు భార్య, అల్లుడి పాత్రపై దర్యాప్తు చేస్తున్నారు. రౌడీషీటర్లపై నిఘా పెంచామని, ప్రతి ఆదివారం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లను కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన డీఎస్పీలు, సీఐలు శేషయ్య, మధుసూదన్‌గౌడు, చంద్రబాబు నాయుడు, శ్రీధర్, తబ్రేజ్, వేణుగోపాల్‌లను ఎస్పీ అభినందించారు.

పోలీసు అధికారులకు పురస్కారాలు

కర్నూలు క్రైం/నంద్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):


హుసేన్ పీరా


యుగంధర్ బాబు

కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం 2025 ఉగాది పురస్కారాలు ప్రకటించింది. ప్రతి ఏడాది ఉగాది సందర్భంగా పలు విభాగాల్లో ఈ అవార్డులు ప్రకటిస్తుంది. ఇందులో భాగంగా నంద్యాల, కర్నూలు జిల్లాలకు చెందిన సుమారు 38 మంది పోలీసులకు ఈ అవార్డులు వరించాయి. కర్నూలు అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుసేన్ పీరా, ఏపీ ఎస్పీ రెండో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేంద్రరావుకు ఉత్తమ సేవా పతకాలు, నంద్యాల అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబుకు సేవా పతకాలు వరించాయి.

ఉత్తమ సేవా పతకం: ముచ్చుమర్రి ఏఎస్ఐ కృష్ణుడు, ఏపీఎస్పీ రెండో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ లూథర్, కర్నూలు హోంగార్డు యూనిట్ ఏఆర్ఎస్ఐ లక్ష్మీకాంతరెడ్డి

కఠిన సేవా పతకం: రెండో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ రామిరెడ్డి, పీసీ రెండో బెటాలియన్ కానిస్టేబుల్ నబీరసూల్,

సేవా పతకం: విజిలెన్స్ సీఐ యుగంధర్ బాబు, సీఐడీ సీఐ నగేష్‌బాబు, కర్నూలు ఏఆర్ విభాగం ఆర్ఐ నారాయణ, ఏఆర్ఎస్ఐ నరసన్న, గూడూరు ఏఎస్ఐ శ్రీనివాసులు, కర్నూలు ఏఆర్ఎస్ఐ గోపాల్, కె. నాగలాపురం హెచ్‌సీలు మహమ్మద్ హనీఫ్, హరిశ్చంద్రుడు, కర్నూలు త్రీటౌన్ పీసీ శిఖామణి, కర్నూలు ట్రాఫిక్ పీసీ ఖలిందర్‌షా, నంద్యాల ఏఆర్ హెచ్‌సీలు జగన్మోహన్ రెడ్డి, ఎల్లప్ప, బేతంచెర్ల హెచ్‌సీ షేక్షావలి, నంద్యాల ట్రాఫిక్ హెచ్‌సీ శ్రీనివాసులు, బండి ఆత్మకూరు ఏఎస్ఐ మహ్మద్ రఫీక్, సంజామల ఏఎస్ఐ నాగరాజు, రెండో బెటాలియన్ ఏఆర్ ఎస్ఐలు శ్రీనివాసరెడ్డి, చక్రపాణి, ప్రహ్లాదరావు, రెండో బెటాలియన్ హెచ్‌సీ సుందరయ్య, కోడుమూరు, డోన్, ఆత్మకూరు ఫైరింగ్ స్టేషన్ల లీడింగ్ ఫైర్‌మన్లు సత్యం, ప్రభాకర్, చైతన్య కుమార్ రెడ్డి, నంద్యాల ఫైర్ స్టేషన్ డ్రైవర్ శ్రీనివాసులు, కర్నూలు విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్, ఇబ్రహీం, కర్నూలు ఎయిర్‌పోర్టు ఎస్ఐ అశ్వంత్ కుమార్.

మెడికల్ దుకాణాల తనిఖీ


కర్నూలులో తనిఖీలు చేస్తున్న అధికారులు

కర్నూలు క్రైం/ హాస్పిటల్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ గరుడలో భాగంగా ఈగల్ చీఫ్ ఐజీ రవికృష్ణ ఆదేశాల మేరకు విజిలెన్స్, డ్రగ్స్ కంట్రోల్, స్థానిక పోలీసుల ఆధ్వ ర్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాలోని మెడికల్ దుకాణాల్లో, ఏజెన్సీలపై తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి, సీఐలు యుగం ధర్‌బాబు, చంద్రశేఖర్ రెడ్డి, డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్లు తేజా, ఏడీ రమాదేవి, తహసీల్దార్ వెంకటనారాయణ తదిత రులు సుమారు 25 పైగా మెడికల్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. పలు మెడికల్ షాపుల్లో నిద్రమత్తు కలిగించే సెడేటివ్ డ్రగ్స్‌ను డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా ఇస్తున్నట్లు తేలింది. కొంతమంది విజిలెన్స్ సిబ్బంది మఫ్టీలో మందుల దుకాణాల వద్దకు వెళ్లి ఈ సెడిటివ్ డ్రగ్స్ ఇవ్వాలని అడుగగా వారు వెంటనే ఇచ్చారు. అలాగే డ్రగ్స్‌పై ఎక్స్‌పైరీ డేట్ ముగిసినా కూడా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే బిల్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు తెల్చారు. కర్నూలులో 15 చోట్ల, ఆదోనిలో 8 దుకాణాల్లో, నంద్యాలలో 10 షాపుల్లో ఈ తనిఖీలు చేశారు.

గ్రేడింగ్ చేయిస్తున్నారని ఫిర్యాదు


సాయంత్రం గ్రేడింగ్ చేసేందుకు వచ్చిన కూలీలు

ఆదోని అగ్రికల్చర్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు వేరుశనగ దిగుబడిని కూలీలు చేత సాయంత్రం 6.30 గంటల వరకు గ్రేడింగ్ చేయిం చడంపై శుక్రవారం సమ్మతి గేరి గ్రామానికి చెందిన పంపన్న అనే రైతు మార్కెట్ యార్డ్ సూపర్‌వైజర్ మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. పొలంలోనే వేరుశనగను ఆరబెట్టుకొని చెత్తాచెదారం, రాళ్లను తొలగించి గ్రేడింగ్ చేసుకొని మార్కెట్ యార్డ్‌కు విక్రయానికి తీసుకొని వచ్చానన్నారు. 91 బస్తాలు మార్కెట్ యార్డ్‌కు తీసుకురాగా మధ్యాహ్నం ఒంటి గంటకే తూకాలు వేసుకోవాల్సింది పోయి సాయత్రం 6.30 గంటలకు మరో 20 మంది కూలీలతో వచ్చి నిబం ధనలకు విరు ద్ధంగా గ్రేడింగ్ చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సదరు టెండర్ దారుడిని గ్రేడింగ్ చేయ్యొద్దని సూచించినా పట్టించుకోకుండా దబాయించా రన్నారు. దీనిపై సూపర్‌వైజర్ మోహన్ రెడ్డిని వివరణ కోరగా.. రైతు పంపన్న కమిషన్ ఏజెంట్ రాతపూర్వకంగా తమకు ఫిర్యాదు చేశారని, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎన్నికలకు ప్రిసైడింగ్ అధికారుల నియామకం

- 27న నామినేషన్, ఎన్నికలు
- జడ్పీ సీఈవో నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలు కలెక్టర్ పర్యవేక్షణలో జరగనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి తెలిపారు. శుక్రవారం మాట్లాడు తూ జిల్లా పరిషత్ కో ఆప్టెడ్ ఎన్నిక కలెక్టర్ పి.రంజి త్‌బాషా పర్యవేక్షణలో జడ్పీ సమావేశం భవనంలో జరుగుతుందన్నారు. తుగ్గలి, వెల్దుర్తి ఎంపీపీ ఎన్నికలు, క్రిష్ణగిరి కో ఆప్టెడ్ ఎన్నికలు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. తుగ్గలి ఎంపీపీ ఎన్నికలకు ప్రిసైడింగ్ అధికారిగా హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కు మార్, వెల్దుర్తి ఎంపీపీ ఎన్నికకు ప్రిసైడింగ్ అధికా రిగా సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసిదేవి, క్రిష్ణగిరి కో ఆప్టెడ్ ఎన్నికకు సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్ వ్యవహరిస్తారన్నారు. 27న ఉదయం 10 గంటలలోపల నామినేషన్ ప్రక్రియ, 10 నుంచి 12 గంటల వరకు పరిశీలన, 12 గంటలకు జాబితా ప్రచురణ, ఒంటి గంటకు ప్రత్యేక సమావేశం అనంతరం ఎన్నికలు జరుగుతాయన్నారు. జడ్పీ కో ఆప్టెడ్ ఎన్నికకు సంబంధించి ఎంపీ, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలకు నోటీసులు జారీ చేస్తామన్నారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని డా. బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల పరీక్ష వాయిదా పడింది. ఏప్రిల్ 6వ తేదీన జరగాల్సిన ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా వేసినట్లు, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ఐ. శ్రీదేవి శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి హాల్ టికెట్ జారీ చేశామన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13వ తేదీన 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడి యట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆన్‌లైన్‌లో వెబ్ సైట్‌ను సంప్రదించాలన్నారు.


పల్లెలను అభివృద్ధి చేస్తాం

- నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంఎం బెహరా


వ్యాపారులతో మాట్లాడుతున్న నాబార్డు డీజీఎం ఎంఎం బెహరా

మద్దికెర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మారుమూల పల్లెలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని నాబార్డు రాష్ట్ర డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.ఎం బెహరా అన్నారు. శుక్రవారం గ్రామంలో నాబార్డు నిధులతో నిర్మించిన కూర గాయల మార్కెట్‌ను పరిశీలించారు. చిరు వ్యాపారులు రోడ్డుకు ఇరువైపుల వ్యాపారం చేసుకునే వారని మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి రూ.3లక్షలు ఇవ్వడంతో నాబార్డు నుంచి రూ.15 లక్షలుతో మార్కెట్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో గోసినాపల్లె, దొర్నిపాడు, బిలేకల్లు, మద్దికెర గ్రామాల్లో నాబార్డు కూరగాయల మార్కెట్‌ను నిర్మించామ న్నారు. ఏజీఎం సుబ్బారెడ్డి, బ్యాంకు మేనేజర్ వెంకటేశ్ గౌడు, ఎంపీడీవో కొండయ్య, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వరరెడ్డి, ముస్బారు రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

- మద్దికెరలోని ఫిల్టర్ బెడ్, పశువుల సంత మార్కెట్, మద్దమ్మకుంట అభివృద్ధి పనులకు నాబార్డు నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు నాబార్డు డీజీఎంను కోరారు. అనంతరం సభ్యులు వి. నాగేశ్వరరెడ్డి, ఆంజనేయులు సన్మానించారు.



వైసీపీ తప్పుడు ప్రచారం మానుకోవాలి

కర్నూలు అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఇకనైనా తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని 2, 11 వార్డుల్లో 400 మంది నాయకులు, కార్యకర్తలు టీడీపీ నుంచి వైసీపీలో చేరినట్లు అసత్య ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. సమావేశంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, కార్పొరేటర్ కురువ పరమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి: సీడీపీవో

కర్నూలు రూరల్, 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు పోషకాహారం ఇవ్వాలని కోడుమూరు నియోజకవర్గ ఐసీడీఎస్ సీడీపీవోలు వరలక్ష్మి, దేవమ్మ అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశించారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలో ఉన్న స్త్రీ శక్తిభవన్‌లో శుక్రవారం కోడుమూరు నియోజకవర్గ అంగన్‌వాడీ టీచర్లకు పోషకాహారంపై మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. సీడీపీవోలు పాల్గొని శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, విజయ లక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



మందులు అందజేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేజీ గంగాధరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించు కోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో, ఆ సంస్థ మాజీ ఛైర్మన్ కేజీ గంగాధరరెడ్డి ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి టీజీ వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు, శిబిర నిర్వాహకుడు కేజీ గంగాధర రెడ్డితోపాటు మెడికవర్, శాంతిరామ్ హాస్పిటల్స్ వైద్యులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

కర్నూలు క్రైం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరిం చుకుని ఉపవాసాల సందర్భంగా స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ముస్లిం పోలీసు సిబ్బందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరై ఇఫ్తార్‌ను స్వీకరించారు. మండ్లెం పీఠాధిపతి కరీముల్లా ప్రార్థనలు చేసి అల్లా దీవెనలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ బాబు ప్రసాద్‌పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ : నగరంలోనీ 10వ వార్డులోని ఖుబ్ సూరత్ బడే సాహేబ్ మసీదులో ముస్లింలు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ విందుకు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఓర్వకల్లు: గుట్టపాడు గ్రామంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు శుక్రవారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ నర్ల మోహన్ రెడ్డి ఇఫ్తార్ ఇచ్చారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో విశ్వంత్ కుమార్ (30) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. విశ్వంత్ కుమార్ స్థానికంగా శకుంతల కళ్యాణ మండపం వద్ద ఉన్న రెడిమెడ్ దుకాణంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. స్థానిక బి.క్యాంపు వద్ద ఉన్న తన తాత శంకర్ దగ్గర ఉంటున్నాడు. విశ్వంత్ తండ్రి కొద్ది కాలం క్రితమే మృతి చెందగా.. తల్లి ఇందిరా, సోదరుడు రాఘవేంద్ర కుమార్ నంద్యాలలో ఉంటున్నారు. ఇటీవల దుస్తుల దుకాణంలో రూ.3.50లక్షలు నగదు వాడుకున్నాడని షోరూం యాజమాన్యం అతనితో ప్రామిసరీ నోటు రాయించుకున్నారు. ఈ విషయం ఇంట్లో తెలియడంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఇంటికి వచ్చిన తాత గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

సెలవులో కల్లూరు తహసీల్దారు

కల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు 15 రోజులపాటు సెలవులో వెళ్లారు. డిప్యూటీ తహసీల్దారు శివరామ్‌కు కల్లూరు తహసీల్దారుగా ఫుల్ అడిషనల్ చార్జ్ ఇచ్చినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

మంత్రి ఫరూక్ సతీమణి మృతి బాధాకరం

కర్నూలు అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మంత్రి ఫరూక్ సతీమణి షహనాజ్ మృతి బాధాకరమని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వాహీద్ హుసేన్ అన్నారు. ఆమె మరణం కుటుంబం సభ్యులకు తీరని లోటని, కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలియజేశారు.

ఫారంపాండ్స్ రైతన్నలకు వరం

- డిప్యూటీ సీఎం పర్యటనను విజయవంతం చేయండి
- ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



పూడిచెర్లలో డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, అధికారులు

ఓర్వకల్లు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన ఫారంపాండ్స్ నిర్మాణం రైతన్నలకు వరం లాంటిదని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఓర్వకల్లు మండలంలోని పూడిచెర్ల గ్రామానికి రానున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యేతోపాటు అధికారులు పరిశీలించారు. ఫారంపాండ్స్ నిర్మాణ భూమిని, బహిరంగ సభ స్టేజీని పరిశీలించి ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అధికారులు సమన్వయంతో త్వరితగతిన పనులు పూర్తి చేసి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు అప్పట్లోనే ఫారంపాండ్స్ రైతు పొలాల్లో ఏర్పాటు చేశామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ ఫారంపాండ్స్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల ఫారంపాండ్స్ నిర్మాణం కోసం డిప్యూటీ సీఎం ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ఫారంపాండ్స్ నిర్మాణంతో భూగర్భ జలాలు పెరగడమే కాకుండా వాటి కింద సాగు చేసిన పంటలకు సాగు నీరు అందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని, ఆర్థికంగా బలపడతాయన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ సీఎం బహిరంగ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. పాణ్యం నియోజకవర్గ సమస్యలు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్‌బాబు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, పెరుగు పురుషోత్తంరెడ్డి, చంద్రపెద్దస్వామి, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, తిరుపాలు, ప్రకాశం, శివుడు, రాజన్న డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీడీ లక్ష్మన్న, ఏపీవో కుమారసాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యటనను విజయవంతం చేయండి: కలెక్టర్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామ పరిధిలో ఉన్న పొలంలో ఫారం పాండ్స్‌కు భూమి పూజ చేసి తదుపరి బహిరంగ సభలో పాల్గొంటున్న సందర్భంగా కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 9.45 గంటలకు డిప్యూటీ సీఎం ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుని అనంతరం పూడిచెర్ల గ్రామ పరిధిలో ఉన్న పొలంలో ఫారమ్ పాండ్‌కు భూమి పూజ చేసి అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఎస్ఈ పీఆర్ రామచంద్ర రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, ఎన్ఈఆర్‌డబ్ల్యూఎస్ నాగేశ్వరరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ ఉమాపతి డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ శాంతకుమారి, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డ్వామా పీడీ వెంకట రమణయ్య, డీఆర్‌డీఏ పీడీ రమణా రెడ్డి, మెప్మా పీడీ నాగశివలీల, డీఐపీఆర్‌వో జయమ్మ, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, డీఎం సివిల్ సప్లయీస్ నాగసుధ, డీఎస్‌వో రాజారఘువీర్, డీఎంహెచ్‌వో శాంతికళ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆపాలి: సీఐటీయూ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బస్సుల ముసుగులో ఆర్టీసీని ప్రైవేటీకరణ చేయడాన్ని ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు అన్నారు. శుక్రవారం కేకే భవన్‌లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ విద్యుత్ బస్సుల వాడకంతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. ముఖ్యంగా కాలుష్యం వాహనాల కంటే పారిశ్రామిక కేంద్రాల నుంచి వస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 24న ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలో రవాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర కోశాధికారి జే.దివాకర్, రీజినల్ కార్యదర్శి వీఎస్.రాయుడు, ఆంజనేయులు పాల్గొన్నారు.

● ఈనెల 24, 25 తేదీలలో దేశవ్యాప్త బ్యాంకుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు జిల్లా కార్యదర్శి అంజిబాబు తెలిపారు. కేకే భవన్‌లో సమ్మెకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, జిల్లా కార్యదర్శివర్గస భ్యులు సాయిబాబా, ప్రభాకర్, రాముడు, నరసింహులు పాల్గొన్నారు.

● బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, బ్యాంకు ఉద్యోగులుకు పని దినాలను వారానికి ఐదు రోజులు మాత్రమే పెట్టాలని కోరుతూ ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే బ్యాంకుల సమ్మెకు డీవైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని జిల్లా కార్యదర్శి నగేష్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, సాయి ఉదయ్, సూరి, మధు, ఆర్యన్. పవన్ పాల్గొన్నారు.

● వీధి కుక్కలను అరికట్టాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు నరసింహులు అన్నారు. శ్రీరామ్‌నగర్‌లో సీపీఎం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శ్రీరామ్‌నగర్‌లో వీధి కుక్కలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్న కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. కార్యక్రమంలో అజ్మత్, ఆర్.శేషం, రాజు, వై.జాన్సన్ పాల్గొన్నారు.

కవులను ప్రోత్సహించడమే లక్ష్యం

కర్నూలు కల్చరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వర్ధమాన కవులను, రచయితలను ప్రోత్సహించడమే అభ్యుదయ రచయితల సంఘం (అరసం) లక్ష్యమని జిల్లా గౌరవ సలహాదారు డాక్టర్ ఎం. హరికిషన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా నగరంలో చిన్న పార్కు సమీపంలోని ఎస్టీయూ భవన్ సమావేశ హాలులో అరసం నగర శాఖ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. హరికిషన్ మాట్లాడుతూ అరసం ఆధ్వర్యంలో అనేక పుస్తకాల ముద్రణ చేస్తూ సాహిత్యాన్ని ప్రజల వద్దకు తీసుకుపోయేలా కృషి చేస్తున్నామని చెప్పారు. సీనియర్ సాహితీవేత్తలు ఆదవాని హనుమంతప్ప, ఎస్.ముర్తుజా, ఎస్‌డీవీ అజీజ్, చిన్నావుల వెంకట రాజారెడ్డి, గుసుమాల మునుస్వామిలను అభినందించారు. అసరం నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రాణి లీలావతి, జీవీ ప్రమోద్ చక్రవర్తి, కార్యక్రమ ప్రతినిధులు పుల్లా రామాంజినేయులు, దాసరి వెంకటరమణ పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్ జన్యుపరమైన రుగ్మత

కర్నూలు హాస్పిటల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): డౌన్ సిండ్రోమ్ వచ్చే జన్యుపరమైన రుగ్మత అని కర్నూలు జీజీహెచ్ చిన్న పిల్లల విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ బి.విజ యానందబాబు అన్నారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా అవగాహన సదస్సు ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాశైలేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజయానందబాబు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 800 మందిలో ఒకరికి డౌన్ సిండ్రోమ్ వస్తుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ అకడమిక్ ఆఫ్ పీడీయాట్రిక్ కార్యదర్శి వి.రత్నకర్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

గూడూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గూడూరు మండలం మల్లాపురం గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్త దాస్ జీ చేసిన ధార్మిక ప్రవచనాలు, శుక్రవారం ఆగమ పండితులు అగ్రహారం రాఘవేంద్రాచార్యులు స్థానిక మహిళలతో గోపూజ, కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లు వెంకట రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కల్లూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి కృష్ణ అన్నారు. శుక్రవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈవోఆర్డీని ఆయనతోపాటు సీపీఎం నాయకులు మధు, గోపికృష్ణ కలిసి వినతిపత్రం అందజేశారు. కూలీలకు పని ప్రదేశంలో టెంట్లు, మజ్జిగ, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

రైతు శిబిరాల ధ్వంసం దుర్మార్గం

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సరిహద్దులో రైతుల ఆందోళన శిబిరాలను కేంద్ర ప్రభుత్వం ధ్వంసం చేయించడం దుర్మార్గమైన చర్య అని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం స్థానిక కొత్తబస్టాండు వద్ద ఉన్న కార్మిక, కర్షక భవన్ నుంచి సుందరయ్య జంక్షన్ వరకు రైతులు ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లయ్య, హనుమంతు రైతులు పాల్గొన్నారు.

పార్క్ స్థలంలో ప్రహరీ నిర్మాణానికి యత్నం

కల్లూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని 20వ వార్డు అరుంధతీ నగర్ పార్క్ స్థలంలో ప్రహరీ నిర్మాణాన్ని డిప్యూటీ సిటీ ప్లానర్ శోభన్‌బాబు అడ్డుకున్నారు. శుక్రవారం అరుంధతీనగర్ పార్క్‌లో స్థాని కులు ప్రహరీ నిర్మించి కబ్జా చేయడానికి యత్నించగా శోభన్‌బాబు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషాతో కలిసి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన మొత్తం 2.20 ఎకరాల పార్క్ స్థలంలో 10 సెంట్లు ఆక్ర మించి అక్రమంగా నిర్మాణం చేయాలన్న స్థానికుల యత్నాన్ని అధికా రులు అడ్డుకున్నారు. కాగా అక్కడ సుంకులమ్మ గుడి నిర్మాణం చేసుకుని పూజలు జరుపుకుంటున్నట్లు, దాతల సహకారంతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఏపీ ఎన్జీవోస్ నాయకుడు వెంగల్ రెడ్డి, తదితర సంఘాల నాయకులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో వ్యవసాయ ఉద్యోగుల సంఘం డైరీని, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కాశన్న మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ఉద్యోగుల బకాయిలు రూ.6,200 కోట్లు చెల్లించేందుకు అనుమతించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి కృష్ణుడు, అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నగర కార్యదర్శి రామకృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలు చందన, వ్యవసాయ శాఖ విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడు చాంద్ బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రికి విరాళం అభినందనీయం

కర్నూలు హాస్పిటల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కార్డియాలజి డిపార్టుమెంట్‌లో డీఎం కోర్సును పూర్తి చేసుకున్న వైద్యవిద్యార్థులు డా.సత్యకు మార్, డా.మహేష్‌లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బీరువా, ఫ్రిజ్‌లను విరాళంగా అందించడం అభినందనీయమని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనకు విద్యాబుద్ధులు నేర్పిన కర్నూలు జీజీహెచ్‌కు విరాళాం ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్డియాలజి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత్, పీజీ వైద్యులు రవికిషోర్, కార్డియాలజి టెక్నీషియన్ శివుడు, పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న డీఎం వైద్య విద్యార్థులతో డాక్టర్ పి.చంద్రశేఖర్

ఆర్‌యూ భూములను కాపాడాలి

కర్నూలు అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీకి ప్రభుత్వం కేటాయించిన భూములను కాపాడాలని విద్యార్థులు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో కబ్జాకు గురైన భూముల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు రామక్రిష్ణ, నాగరాజు, ఉద్యోగులు సుంకన్న, వెంకటస్వామి, మాధవ శేఖర్ మాట్లాడారు. 1992లో ప్రభుత్వం రాయలసీమ యూనివర్సిటీని ప్రకటిస్తూ 262 ఎకరాల భూములను కేటాయించింది. గత పది సంవత్సరాల కాలంలో అధికారుల అలసత్వం, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా 110 ఎకరాలు మాత్రమే మిగిలిందని, ఇది చాలా దారుణమని వాపోయారు. పసుపల రోడ్డులో ఉన్న సర్వే నెంబరు 9-3-1 లో గల 1.50 ఎకరాల భూమిని అప్పటి వర్సిటీ అధికారుల అండతో కొద్ది మంది కబ్జా చేసి వారి పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇదే సర్వే నెంబర్‌కు సంబంధించిన భూమికి ఎన్‌ఓసీ ఇచ్చినప్పటికీ ఉపకులపతి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే భూమిని కాపాడి వర్సిటీ సౌర్యార్థం నిర్మాణాలు చేపట్టాలని కోరారు. వర్సిటీ భూములను కాపాడుకోవడానికి అవసరమైతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మౌళాలి, రాజు, సాగర్, శివ, దివాకర్, అశోక్, బసిరెడ్డి, ఉసేనయ్యా, పీజీ, బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌లో ఎస్ఐ పదోన్నతుల కోసం పరీక్షలు

కర్నూలు అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో ఎస్ఐ పదోన్నతుల కోసం జూనియర్ అసిస్టెంట్లకు ఛాతీ, ఎత్తు, బరువు కొలతలకు సంబంధించిన పరీక్షలు జరిగాయని డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఆరణలో జరిగిన పరీక్షలకు రాయలసీమ జిల్లాల నుంచి 17 మంది హాజరు కావాల్సి ఉండగా ఒకరు గైర్హాజరయ్యారు. 16 మంది క్వాలిఫై అయ్యారని తెలిపారు. వీరికి మెడికల్ టెస్టింగ్ తర్వాత పూర్తి స్థాయిలో నివేదికను అందజేస్తామని చెప్పారు. లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాములు, ఆర్ఐ అడ్మిన్, సిబ్బంది సమక్షంలో పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్, ఏఈఎస్ రామక్రిష్ణ, సీఐలు చంద్రహస్, రాజేంద్ర ప్రసాద్‌లు పాల్గొన్నారు.

27న బార్ అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు లీగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బార్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, బీఎస్ రవికాంత్ ప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న నామినేషన్ల దాఖలు, 25న నామినేషన్ల ఉపసంహరణ, 26న బార్ అసోసియేషన్ సభ్యులనుద్దేశించి పోటీ చేస్తున్న అభ్యర్థుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 27న ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు సాయంత్రం 3 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తారని చెప్పారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది జి.విజయకుమార్, సహాయ ఎన్నికల అధికారులుగా న్యాయవాదులు కే మోహన్‌బాబు, కే రంగనాథ్, పి.ప్రభాకర్ రెడ్డిలు వ్యవహరిస్తారని వారు ఆ ప్రకటనలో తెలిపారు.

తండ్రి మరణించిన దుఃఖంలోనూ పరీక్ష రాసిన విద్యార్థి

కల్లూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విధి పెట్టిన పరీక్షలో గువ్వల రామ్‌చరణ్ ఉత్తీర్ణత సాధించాడు. కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామానికి చెందిన గువ్వల మహేశ్వరి, నాగేషులు కుమారుడు రామ్‌చరణ్ ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం నాగేషులు అనారోగ్యంతో చనిపోయాడు. తండ్రి మరణపు విషాదంలో కూడా రామ్‌చరణ్ శుక్రవారం పరీక్షకు హాజరయ్యారు. అనంతరం స్వగ్రామంలో తండ్రి దహన సంస్కారాల్లో పాల్గొన్నాడు.

రైతులను ఆదుకోవాలి

ఓర్వకల్లు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పూడిచెర్ల గ్రామానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం రానున్న సందర్భంగా రైతులకు జరిగిన అన్యాయాన్ని పరిశీలించాలని కోరారు. పైపులైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు ఉక్కు పరిశ్రమ కోసం ఆఘమేఘాల మీద పైపులైన్ వేసి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని, అయితే ఆ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. డిప్యూటీ సీఎం స్పందించి తక్షణమే నష్ట పరిహారం ఇచ్చేలా కృషి చేయాలన్నారు. గతంలో ఫారంపాండ్స్ నిర్మాణాలు చేపట్టారని, అయితే వాటిలో పశువుల పడి చనిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, నారాయణ, వెంకటేశ్వర్లు, రంగస్వామి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతిపాదనలు రూపొందించండి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూడో వార్డు బండిమెట్టలో సచివాలయ, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలను రూపొందించాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బండిమెట్ట ప్రాంతంలో ప్రజలతో కలిసి పర్యటించారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. నిరుపయోగ స్థలాల్లో ప్రజలకు ఉపయోగపడే భవనాలను నిర్మిస్తామన్నారు. కమిషనర్ వెంట ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ శ్రీనివాసరెడ్డి, టీపీఎస్ దామోదర్, ట్రైనీ ఏఈ స్వాతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకేష్ ఉన్నారు.

అరెస్టు అన్యాయం

కర్నూలు న్యూసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటే మాల నాయకులను హౌస్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు అన్నారు. శుక్రవారం మాధవినగర్‌లోని మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో జరిగే మాలల సింహ గర్జన వాయిదా పడినప్పటికీ అక్కడికి వెళ్లేందుకు సిద్ధమైన నాయకులను పోలీసులు హౌస్ అరెస్టు చేయడం అన్యాయమన్నారు. త్వరలో ఒక తేదీని నిర్ణ యించి తిరుపతి వేదిక సభ నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సూర్య అనిల్, రాజు, మౌళి పాల్గొన్నారు.

బాలలను వేధిస్తే చర్యలు

కర్నూలు లీగల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బాలలను వేధింపులకు గురిచేస్తే చర్యలు తప్పవని కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి జ్యోష్ణదేవి అన్నారు. నగర శివారులోని దిన్నెదేవరపాడు గ్రామంలో పోక్సో చట్టంపై శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా న్యాయాధికారి జ్యోష్ణదేవి హాజరై ప్రసంగించారు. స్మార్ట్ ఫోన్లు, టీవీలను అవసరమైన విజ్ఞానం కోసమే వాడుకోవాలన్నారు. ఛైల్డ్‌పోర్నోగ్రఫీ కోసం బాలబాలికలను ఎవరైనా అపరిచిత వ్యక్తులు సం ప్రదిస్తే తల్లిదండ్రులకు గానీ, పోలీసులకు గానీ ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.నరేష్, పాఠ శాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ యాసిన్, విద్యాకమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్లు అధ్యక్షతన కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో మద్దతు ధరల చట్టం కోసం ఆందోళన చేస్తున్న రైతులపైన ఢిల్లీ, పంజాబు ప్రభుత్వాలు దాడి చేసి రైతు శిబిరాలను కూల్చడం అన్యాయమన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20వేల రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. ఈసమావేశంలో ఉపాధ్యక్షుడు మల్లయ్య, కోటకండ సూరి, వనజ, హనుమంతు, కృష్ణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో పెద్దపాడు దగ్గర ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న బీరప్ప స్వామి ఆలయ నిర్మాణం కోసం కల్లూరు మండలం పందిపాడు గ్రామ కురువ సంఘం రూ.43,200 విరాళం అందజేసినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.కే రంగస్వామి, జిల్లా ఉపాధ్య క్షుడు పెద్దపాడు ధనుంజయలు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో పందిపాడు గ్రామ కురువ కమిటీ సభ్యులు కే.భీమ్మడు, బీసన్న, పెద్దమ ద్దిలేటి, రాముడు, కేసీ నాగన్న, బొజ్జన్న, జిల్లా కమిటి సభ్యులు నాగన్న పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల్లగేట్ ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ ఆదోని అసెంబ్లీకో కన్వీనర్ నాగరాజ్ గౌడ్, ఆదోని సెంట్రల్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ మరియాని చెన్న బసప్ప అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ వైఎంకే హైస్కూల్ ప్రాంతంలో రైల్వే గేట్ మూసివేయడంతో ప్రజలు, రైతులు, కూలీలు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి సూచన మేరకు కోసిగి రైల్వే ఇంజనీరింగ్ సిబ్బంది సర్వే కూడా చేశారన్నారు. పనులు ప్రారంభించాలని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు వినతిపత్రం పంపుతామన్నారు. సెంట్రల్ టౌన్ ప్రెసిడెంట్ నాగార్జున, మధుసూదన్, రమేష్, కోసిగియ్య పాల్గొన్నారు.

సారా అమ్మినా, తయారు చేసినా పీడీ యాక్టు

తుగ్గలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారు చేసినా అమ్మినా పీడీ యాక్టు నమోదు చేస్తామని పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి, పగిడిరాయి గిరిజన తాండాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సారా తో అల్లర్లు జరుగుతాయని, ప్రజలు తీవ్రంగా నష్టపోతారనీ తెలిపారు. ఎస్ఐ సాయిప్రవీన్, సర్దార్ తదితరులు ఉన్నారు.

హుండీ ఆదాయం రూ.21 లక్షలు

మద్దికెర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామం రంగనాథ స్వామి ఆలయం హుండీని గురువారం లెక్కించగా రూ.21లక్షల ఆదాయం వచ్చిందని ఈవో వీరయ్య తెలిపారు. శుక్రవారం ఆలయ పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్లు, రంగనాథ స్వామి సేవా సమితి, భ్రమరాంబిక సేవా సమితి ఆధ్వర్యంలో హుండీని లెక్కించామన్నారు. కానుకలు చదివింపుల ద్వారా రూ.3,56,329లు సేవా టికెట్ల ద్వారా రూ.2,55,405లు, ఐదు నెలల శాశ్వత హుండీ లెక్కింపు ద్వారా రూ.7,25,691లు, తాత్కాలిక హుండీ ద్వారా రూ.7,88,248లు మొత్తం రూ.21,25,673లు వచ్చిందని తెలిపారు. ప్రధాన అర్చకులు రంగస్వామి ఉన్నారు.

పనిముట్లను వినియోగించుకోవాలి

• ఏడీఏ బాలవర్ధిని రాజు



ఆదోని అగ్రికల్చర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చిన్న, సన్న కారు రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీ యాంత్రీకరణ పనిముట్లను వినియో గించుకోవాలని ఏడీఏ బాలవర్ధిని రాజు సూచించారు. గురువారం మాట్లాడుతూ ఆదోని, కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, మండలాల రైతులకు 40-50 శాతం రాయితీతో తైవాన్ పంపులు, ట్రాక్టర్ పరికరాలు గొర్రు, నాగళ్లు రోటావేటర్, సీడ్ డ్రిల్లు బ్లేడు స్వీయయంత్ర పరికరాలు, పురుగు మందు పిచికారీ చేసే తైవాన్ స్ప్రేయర్లు అందిస్తున్నామన్నారు. రూ.43.99లక్షల విలువ చేసే 24 యంత్రపరికరాలు మంజూరయ్యా యని, ఈనెల 31 లోపు రైతులు తమ సమీపై రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వంద రోజులు పని కల్పించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఏపీవో

తుగ్గలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించాలని ఎంపీడీవో విశ్వమోహన్, ఏపీవో హేమసుందర్ సూచించారు. శుక్రవారం తుగ్గలి ఏపీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికిగానూ మార్చి 31లోపు ప్రతి కూలీ వంద రోజుల పనులు పూర్తయిండాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏలు రాజశేఖర్, రామకృష్ణ పరీదప్ప తదితరులు ఉన్నారు.

రైతులకు అండగా ఉంటా



చైర్మన్‌ను సన్మానిస్తున్న రైతులు

హొళగుంద, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ఉంటానని ఎల్‌ఎల్‌సీ ప్రాజెక్టు తుంగభద్ర కమిటీ చైర్మన్ టిప్పుసుల్తాన్ అన్నారు. శుక్రవారం ఎల్లెల్సీని పరిశీలించి అనంతరం తుంగభద్ర బోర్డు కార్యాలయంలో మాట్లాడుతూ రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా చూస్తానన్నారు. డిస్ట్రిబ్యూషన్ పాయింట్లను తనిఖీ చేశానని తెలిపారు. హొళగుంద రైతు సంఘం నాయకులు సిందూవాళం కృష్ణయ్య రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయనను జడ్పీ ఉన్నత పాఠశాల పీసీ కమిటీ చైర్మన్ ద్వారకానాథ్ సన్మానించారు. డీఈ షఫీ, ఏఈ ఈశ్వర, సెక్షన్ 4 జేఈ నవజీవన్ రెడ్డి, టీడీపీ నాయకులు సిద్దిక్, హుస్సేన్ పీరా పాల్గొన్నారు.

ఎడమ కాలువను పొడిగించాలి

పత్తికొండ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయర్ పరిధిలోని ఎడమ కాలువను పొడిగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సంతకాల సేకరణ నిర్వహించారు. మండలంలోని పెద్దహుల్తి గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, రైతు సంఘం కార్యదర్శి సురేంద్ర కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, గౌరవాధ్యక్షుడు కారన్న మాట్లాడుతూ ఎడమ కాలువను పూర్తి చేసి సాగునీరు అందించాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ నెల 27న తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేస్తామమన్నారు. రామాంజనేయులు, కారుమంచి సిద్దు, నాగిరెడ్డి, రాజప్ప, ఉపేంద్ర పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

కొలిక్కిరాని ఎంపిక

• సబ్సిడీ రుణాల కోసం బ్యాంకుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
• ఆలూరు మండలానికి 70 యూనిట్లకు 680 దరఖాస్తులు



ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీవో, బ్యాంకర్లు (ఫైల్)

ఆలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ల రాయితీ రుణాలు అందజేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దాదాపు 690 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. గత నెలలోనే అధికారులు, బ్యాంకర్లు ఇంటర్వ్యూలను కూడా పూర్తి చేశారు. అయితే జాబితా విడుదల కాకపోవడంతో దరఖాస్తుదారులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఆలూరు మండలానికి 70 యూనిట్లు

రుణాలు ఇచ్చేందుకు పట్టణంలోని ఏపీజీబీ, యూనియన్ బ్యాంక్, ఎస్బీఐతో పాటు మొలగవల్లి ఎస్బీఐ, ఆస్పరి ఏపీజీబీలను కేటాయించారు. ఆలూరు స్టేట్ బ్యాంక్ పరిధిలో 15, యూనియన్ బ్యాంక్ 15, ఏపీజీబీ 11, మొలగవల్లి 15, పెద్ద హోతూరు 9 యూనిట్లు చొప్పున మొత్తం 70 యూనిట్లు మంజూరయ్యాయి. అయితే అధికారులు లబ్దిదారుల తుది జాబితాను విడుదల చేయలేదు.

ఎంపికలో నాయకుల తలమునకలు

రుణాల మంజూరుకు అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడంతో ఎవరిని ఎంపిక చేయాలో అధికార పార్టీ నాయకులు తలమునకలయ్యారు. దీనికితోడు కూటమిలో మూడు పార్టీలు ఉండ టంతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తమదే నిర్ణయమని చెప్పుకుం టున్నారు. 50 శాతం రాయితీ వస్తుండటంతో ఎక్కువ మంది అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు.

సకాలంలో పూర్తి చేస్తాం



రాయితీ రుణాలకు అభ్యర్థుల ఎంపికను సకాలంలో పూర్తిచేస్తాం. ప్రతి యూనిట్‌కు ఇద్దరిని ఎంపిక చేసి బ్యాంకులకు అందజేస్తాం. బ్యాంకర్ల అనుమతి వచ్చిన వెంటనే లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తాం.

- మహబూబ్ బాషా, ఎంపీడీవో, ఆలూరు

కస్తూర్బాలో ప్రవేశాలు

తుగ్గలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలలో ప్రవేశాలకు బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షాహీన్ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీలోపు 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే 7, 8, 9, 10 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్లకోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

సారా నిర్మూలనకు కృషి చేద్దాం

ఆలూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సారా, కర్నాటక మద్యం నిర్మూలనకు కృషి చేద్దామని ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత దేవి, ఎస్ఐ నవీన్ బాబు కోరారు. శుక్రవారం ఆలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కైరుప్పల, బిలేకల్, కారుమంచి గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. భావి తరాల భవిష్యత్తు కోసం సారాకు దూరంగా ఉండాలని సూచించారు. కర్నాటక మద్యం, సారా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ కానిస్టేబుళ్లు సోమశేఖర్, విజయకుమార్, రంగముని పాల్గొన్నారు.

30 ఏళ్ల కల సాకారం

వెల్దుర్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మాదిగల 30 ఏళ్ల కల సాకారమయిందని ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుండాల ఈశ్వరయ్య మాదిగ అన్నారు. శుక్రవారం వెల్దుర్తిలో జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాదిగ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంతో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. పీఎం మోడీ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

• ఆదోని, పత్తికొండ, దేవనకొండలో ఉపాధి కూలీల భిక్షాటన



ఆదోనిలో భిక్షాటన చేస్తున్న కూలీలు, నాయకులు

ఆదోని రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తమకు వేతనాలు ఇవ్వాలని ఉపాధి కూలీలు రోడ్డెక్కి భిక్షాటన చేశారు. శుక్రవారం కార్మిక సంఘం నాయకులతో కలిసి గ్రామాలకు చెందిన ఉపాధి హామీ కూలీలు భీమాస్ సర్కిల్ నుంచి శ్రీనివాస్ భవన్ వరకు భిక్షాటన చేశారు. జనవరి నుంచి ఇంతవరకు కూలీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం పనిచేసిన 15 రోజుల్లోపే వేతనాలు చెల్లించాల్సి ఉండగా, ఇంతవరకు చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పత్తికొండ టౌన్: ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయ సంఘం నాయకులు నరసన్న, దస్తగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఉసేని, శిఖామణి, భాషా, హుశేన్‌బీ, హసీనా పాల్గొన్నారు

దేవనకొండ: ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని సీపీఎం నాయకులు శుక్రవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మికసంఘం అధ్వర్యంలో బస్టాండ్ అవరణలో భిక్షాటన చేశారు. పది వారాలుగా వేతనాలు మంజూరు కాకపోతే కూలీలు ఏలా బ్రతకాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాల నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతుందన్నారు. మండల కార్యదర్శి మహబుబ్ బాష, ఆశోక్, బజారి పాల్గొన్నారు.

విశ్వాసం లేకనే అవిశ్వాస తీర్మానం

• చైర్‌పర్సన్ దీక్ష చేయడం విడ్డూరం: వైసీపీ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న వైసీపీ కౌన్సిలర్ సందీప్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంతపై తమకు విశ్వాసం లేకనే అవిశ్వాత తీర్మానం పెడుతున్నట్లు వైసీపీ కౌన్సిలర్ సందీప్ రెడ్డి అన్నారు. శుక్రవారం వైస్ చైర్మన్ నరసింహులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆదోని పట్టణంలో 42 వార్డులకు గాను 41 వార్డుల్లో వైసీపీ గెలుపొందిందన్నారు. నాడు మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తమను ఒప్పించడంతో శాంతను ఎన్నుకున్నామన్నారు. పది నెలలుగా వార్డుల్లో ఏ ఒక్క పని కూడా చేయకపోవడంతో ప్రజలు తమను నిలదీస్తున్నారన్నారు. అవిశ్వాస తీర్మానం కోసం కలెక్టర్ కలిస్తే దీక్ష చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా రాజీనామా చేయాలని కోరారు. కౌన్సిలర్లు బాలాజీ, చలపతి రామలింగేశ్వర యాదవ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

లైసెన్స్ ఫీజు తగ్గింపు పట్ల హర్షం

ఆదోని టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎల్‌టీపీల లైసెన్స్ ఫీజును రూ. 10వేల నుంచి కేవలం రూ.1కి తగ్గించడం పట్ల ఎల్‌టీపీ అసోసియేషన్ నాయకులు దేవేంద్ర, చిన్నరంగ స్వామి తమ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మున్సిపల్ మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే భవన నిర్మాణంలో యజమానులు చేసే తప్పులకు తమను బాధ్యులుగా చేయకుండా, తమ లైసెన్స్‌లకు బ్లాక్ లిస్ట్‌లో పెట్టకుండా సడలింపు ఇవ్వాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



జడ్పీ పాఠశాలలో కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

ఆస్పరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు కృష్ణమూరి, రైతు సంఘం అధ్యక్షుడు నాగేంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మాట్లాడుతూ భోజన పథకానికి డొక్కా సీతమ్మ పథకంగా మారిస్తే సరిపోదని వంటపనివారికి రూ.3వేలు, స్వీపర్లు, ఆయాలకు రూ.6వేలు ఏమాత్రమని ఎద్దేవా చేశారు. కనీస వేతనం 12వేలు ఇవ్వాలన్నారు. రంగన్న, మానందమ్మ, తిరుపతమ్మ, సంధ్యారాణి, భాగ్యమ్మ, జయమ్మ, లక్ష్మి, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న పరీక్షలు

హొళగుంద, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఏ, బీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పరీక్షా కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ శ్రీనివాసులు, జగదీష్ శుక్రవారం తెలిపారు. మొత్తం 565 మంది విద్యార్థులకు గాను 554 మంది పరీక్షలకు హాజరుకాగా, 11 మంది గైర్హాజరయ్యారు. ఎంఈవోలు సత్యనారాయణ, జగన్నాధం, ఎస్సై బాలనరసింహులు భద్రతను పర్యవేక్షించారు.



కాల్వ దుస్థితిని చూపుతున్న వార్డు సభ్యులు

డ్రైనేజీని పట్టించుకోరా?

ఆలూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మొలగవల్లి గ్రామంలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నా ఘపట్టించుకోరా? జడ్పీహెచ్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సురేష్, వార్డు సభ్యుడు జలంధర్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ కాల్వలో పూడిక తియ్యక దుర్వాసన వెదజల్లుతోందన్నారు.

జగన్ స్పందించే వరకు రాజీనామా చేయను

• చైర్‌పర్సన్ వాల్మీకి శాంత

ఆదోని టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగనన్న స్పందించే వరకు పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ వాల్మీకి శాంత అన్నారు. రెండో రోజు శుక్రవారం నిరాహార దీక్షను ఆమె కొనసాగించారు. వైసీపీ నాయకులు తెలివిగా మాట్లాడుతున్నారని, నిజానిజాలు ప్రజలకు తెలుసన్నారు. వైసీపీ కౌన్సిలర్లను బజారులో నిలబెట్టి, మర్యాద తీసినట్టు చెబుతున్న నాయకులు తనపై అవిశ్వాస తీర్మానం పెట్టేముందు తన వివరణ ఎందుకు డగలేదని సూటిగా ప్రశ్నించారు. రాజకీయాలలో తాను, తన భర్త ఎక్కడా అవినీతికి పాల్పడలేదన్న విషయం పట్టణ ప్రజలతో పాటు మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, సభ్యులందరికీ తెలుసన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే రహదారి నిర్మాణం

ఆలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి ఎమ్మెల్యే విరుపాక్షి కృషితోనే నిర్మాణం పరుష్తయిందని పెద్ద హొత్తూరు ఎంపీటీసీ దేవరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు భాస్కర్, నాగేంద్ర వార్డ్ మెంబర్ వరుణ్ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ అధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. అధికారం లేకున్నా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్నారే తప్ప టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నట్లు ఫోటోలకు ఫోజుల కోసం కాదన్నారు. చౌకబారు విమర్శలు చేయడం కూటమి నాయకులు మానుకోవాలన్నారు. వీరేష్, రామలింగ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

క్రిష్ణగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మహిళలకు పోక్సో చట్టంపై అవగాహన ఉండాలని జేసీ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతి సూచించారు. కంబాలపాడు గ్రామంలో శుక్రవారం అవగాహన కల్పించారు. బాలికలకు తల్లిదండ్రులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని కోరారు. లైంగిక వేధింపులకు గురైతే ధైర్యంగా తల్లిదండ్రులకు చెప్పేలా పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీటీసీ చంద్రమ్మ, ఉప సర్పంచ్ రామలక్ష్మి, అడ్వకేట్ కుమారి ఉన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

• ఆదోనిలో ఆపరేషన్ గరుడ • మెడికల్ ఏజెన్సీలు, దుకాణల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

ఆదోని, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఈగల్ ఎస్సై శ్రీహరి, సీఐ శ్రీరామ్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ హెచ్చరించారు. పట్టణంలో శుక్రవారం ఆపరేషన్ గరుడలో భాగంగా మెడికల్ ఏజెన్సీలు, షాపులలో ఈగల్ టీమ్, విజిలెన్స్, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. 20 మెడికల్ షాపులలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయించినట్లు గుర్తించారు. నిషేధిత మత్తు పదార్థాలు ఉన్నాయా? అని పరీశించారు. 8 మెడికల్ షాపులలో అనుమతి లేని మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించామని, జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ మందులు విక్రయించరాదని దుకాణాదారులను హెచ్చరించారు.

బకాయిదారుల షాపులకు తాళాలు



షాపులకు తాళాలు వేస్తున్న మున్సిపల్ అధికారులు

ఆదోని టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఆస్తి పన్నుల వసూళ్లకు కొరడా ఝుళిపించారు. శుక్రవారం కమిషనర్ కృష్ణ, రెవెన్యూ ఆఫీసర్ బకాయిలు చెలించని వారి దుకాణాలకు తాళాలు వేశారు. నివాస గృహాల వారు పన్నులు చెల్లించకుంటే ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే నీటి పన్నులను చెల్లించని 500 కొళాయి కనెక్షన్లను తొలగించారు. నెలాఖరులోగా రు. 14కోట్ల టార్గెట్ వసూలు చేస్తామని కమి షనర్ ఆశాభావం వ్యక్తం చేసారు. సెలవు రోజుల్లో కూడా ప్రజల సౌకర్యార్థం పన్నుల చెల్లింపు కౌంటర్లు పని చేస్తాయని అన్నారు



హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

గర్భిణులను గుర్తించాలి

మద్దికెర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రాంతాల్లో పర్యటించి గర్భిణులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రోగ్రాం మేనేజింగ్ అధికారి డా.ఉమ, విజయరామరావు అన్నారు. శుక్రవారం మద్దికెర ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. మాతా శిశు మరణాలు నివారించడానికి ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ సిబ్బంది సమష్టిగా వైద్యసేవలు అందించాలని, విధిగా ఆన్‌లైన్‌లో రికార్డులలో ఒకేలా నమోదు చేయాలన్నారు. రక్తహీనతను నివారించి ప్రసవాలు ప్రభుత్వ వైద్యశాలలోనే జరిగేలా చూడాలన్నారు. వైద్యాధికారి శ్రీలక్ష్మి, సీహెచ్‌వో నిరంజన్ బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, ల్యాబ్ టెక్నీషియన్ విజయకుమార్ ఉన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

సమ్మెను జయప్రదం చేయండి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24, 25 తేదీల్లో చేయనున్న బ్యాంకు ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు తిప్పన, కార్యదర్శి పీఎస్‌గోపాల్, లక్ష్మన్న కోరారు. శుక్రవారం గోడపత్రికలను విడుదల చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న లేబర్ కోడ్‌ను కార్మికులంతా వ్యతిరేకించాలని కోరారు. బ్యాంకుల ప్రైవేటీకరణను ఆపాలన్నారు.

కవిత్వం దిక్సూచి

ఆదోని అగ్రికల్చర్ మార్చి 21 (ఆంధ్ర జ్యోతి) : కవిత్వం సమాజానికి దిక్సూచి అని సాహితి స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం అకాడమీలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహించారు. ఉరుకులు పరుగుల జీవితంలో కవిత్వాన్ని ఆస్వాదిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. జిల్లా కార్యదర్శి మల్లికార్జున, గౌరవ అధ్యక్షురాలు నాగమణి, మల్లేకర్ నాగజ్యోతి, నల్లారెడ్డి, రామలక్ష్మి, డాక్టర్ సక్కరి భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కవులు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



దేవనకొండలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పత్తికొండ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రకృతివ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి ఏపీఎం చక్రదర్ సూచించారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో వ్యవసాయ, వెలుగు డీఆర్‌డీఏ శాఖలతో ఖరీఫ్ కార్యచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. మండలంలో అధిక శాతంలో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏఈవోలు శ్రీనాథ్, సర్వేశ్వరుడు, మల్లికార్జున పాల్గొన్నారు.

దేవనకొండ: ప్రకృతి వ్యవసాయంతోనే రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వెలుగు ఏపీఎం నర్సన్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో ప్రజా భాగ్యస్వామ్య ప్రకృతి వ్యవసాయం పై వివోఏ, వివోఏబీలకు శిక్షణ ఇచ్చారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం యుమాలరారకె, సీసీ మస్తాన్, ముద్దురంగడు, స్వామన్న, ప్రభాకర్, విష్ణు, ఏసీ శివ పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలపాలి

• స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ



మాట్లాడుతున్న అనూరాధ

మంత్రాలయం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల ఆధునీకరణ, కొత్త కేంద్రాల గుర్తింపు, ఓటరు నమోదులో ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మంత్రాలయం ఆర్వో అనూరాధ అన్నారు. శుక్రవారం మంత్రాలయం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.రవి అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల ఆధునీకరణ చేయడం, ఓటరు నమోదులో మార్పులు, చేర్పులు, అవసరమైన చోట కొత్త కేంద్రం ఏర్పాటుపై సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. రాజకీయ పార్టీలు, ఆయా మండలాల అధికారుల సూచనలు, సలహాలతోనే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్దకడుబూరు, కౌతాళం, కోసిగి తహసీల్దార్లు గీతా ప్రియదర్శిని, రజనీకాంత్ రెడ్డి, రుద్రగౌడు, ఎన్నికల డిటీలు జీకే గురురాజారావు, సీపీఎం జయరాజు, బీఎస్పీ సామేల్, సీపీఐ లక్ష్మణ్ నాయక్‌లు పాల్గొన్నారు.

రహదారి పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచాపురంలో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించనున్నట్లు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ సర్పంచ్ కాశీంవలి తెలిపారు. శుక్రవారం గ్రామంలో రోడ్లు ఎక్కడ ఎక్కడ వేయాలో కాంట్రాక్టర్ సీతారాముడుతో కలిసి పరిశీలించారు. గ్రామానికి రూ. 10లక్షలు ఎమ్మెల్యే బీవీ నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ యూత్ నాయకులు బడేసాబ్ వలి, పంచాయతీ కార్యదర్శి పెద్దరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ఆదాయం

పోటాపోటీగా పంచాయతీ వేలాలు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కోసిగి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కోసిగి మేజర్ పంచాయతీకి రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. వేలాల్లో గత ఏడాది పంచాయతీకి రూ.8.71 లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.23,70లక్షలు ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు గ్రామ సర్పంచ్ కుమారి సంజీపోగు అయ్యమ్మ, డీఎల్‌పీవో నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం కోసిగి మేజర్ పంచాయతీ కార్యాలయంలో వేలాలు నిర్వహించారు. సంత మార్కెట్‌ను వేలందారుడు రణతిక్కన్న రూ.4.50లక్షలకు దక్కించుకున్నాడు. బండిమెట్టను పోతుల మధు రూ.27.20 లక్షలకు, చిన్న కబేళా ఖలందర్ రూ.33వేలకు, పెద్ద కబేళాను మాణిక్యరాజు రూ.35వేలకు దక్కించుకున్నట్లు డీఎల్‌పీవో నూర్జహాన్ తెలిపారు. ఈ ఏడాది కోసిగి మేజర్ పంచాయతీకి రికార్డు స్థాయిలో రూ.23.72లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. పంచాయతీ వేలాల్లో టీడీపీ, వైసీపీ, ఇతరు నాయకులు పోటీగా పాల్గొనగా.. టీడీపీ మద్దతుదారులే పంచాయతీ వేలాలను కైవసం చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి గట్టిబందోబస్తు నిర్వహించారు.

రమణీయం.. స్వర్ణ పల్లకోత్సవం



స్వర్ణ పల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్రుడు

మంత్రాలయం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం పాల్గుణ సప్తమి శుభదినం సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూల బృందావనానికి పూజలు నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్టించి ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ చేశారు. బృందావనానికి బంగారు, వెండి,పట్టు వస్త్రాలు, గులాబి పుష్పాలతో అలంకరించారు.

శ్రీమఠానికి విరాళం

మంత్రాలయం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన జానకిరామ్ అనే భక్తుడు రూ.5 లక్షలు అన్నదానానికి, ఉడిపికి చెందిన విఠల్ భట్ అనే భక్తుడు రూ. రెండు లక్షలు సంపూర్ణ సేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్‌కోణాపూర్ తెలిపారు. శుక్రవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, గిరిధర్, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్‌లు పాల్గొన్నారు.

పట్టించుకునేవారెవరు..?

• ఎస్ఎస్ ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత
• కలుషితమవుతున్న తాగునీరు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణులకు సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలనే సంకల్పంతో ఇంటింటికి కుళాయిలను, తాగునీటి పథకాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందుకు లక్షల రూపాయాలను వెచ్చిస్తుంది. అయితే అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వంతో తాగునీటి సరఫరా పథకాలు నిర్లక్ష్యానికి,



ట్యాంకు లోపలి భాగంలో కుంగిన సిమెంట్ అంచుభాగం

నిర్వాహణ లోపానికి గురువుతున్నాయి. ఎమ్మిగనూరు మండలంలోని సంతనాగలాపురం గ్రామంలో ఉన్న ఎస్ఎస్ ట్యాంకు అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఈ ట్యాంకు నీటిని సంతనాగలాపురంతో పాటు కడివెళ్ల, కందనాతి, మసీదుపురం, మాస్‌మాన్‌దొడ్డి, గుడికల్లు, వెంకటగిరి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. నిత్యం ఎస్ఎస్ ట్యాంకును పర్యవేక్షించాల్సిన అధికారులు, కాంట్రాక్టర్లు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో చుట్టూ జమ్మి మొక్కలు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా పోయింది. నిత్యం మద్యం ప్రియులు ట్యాంకు దగ్గర మద్యం తాగి బాటిళ్లను అక్కడే పడేసి వెళ్తున్నారు.

పనిచేయని ఫిల్టర్‌బెడ్లు: ఎస్ఎస్ ట్యాంకు ద్వారా రోజుకు దాదాపు ఐదు లక్షల లీటర్లను ఆయా గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. అయితే ఫిల్టర్‌బెడ్లు పని చేయకపోవడంతో నేరుగా తాగునీటిని గ్రామాలకు



సంతనాగలాపురం ఎస్ఎస్ ట్యాంకు ముందు దట్టంగా పెరిగిన జమ్మి, పిచ్చిమొక్కలు

సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని తాగిన జనాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎస్ఎస్ ట్యాంకు నిర్వాహణకు రోజుకు రూ.ఏడువేల వరకు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంత ఖర్చు చేస్తున్నా కనీసం ట్యాంకు పరిసరాలు శుభ్రంగా ఉంచడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ప్రజల ప్రాణాలంటే లెక్కలేకుండా పోయింది



ప్రజల ప్రాణాలంటే అధికారులకు లెక్కలేకుండా పోయింది. ఏడు గ్రామాల ప్రజలు తాగుతున్న నీటిని ఫిల్టర్ చేయకుండా నేరుగా వదులుతుండడం బాధాకరం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

- సత్యన్న, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి

రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపాం



ఎస్ఎస్ ట్యాంకు దగ్గర ఫిల్టర్ బెడ్లు, గ్రావెల్ తదితర పనుల కోసం ప్రభుత్వానికి రూ.50లక్షల ప్రతిపాదనలు పంపాం. ఇంకా నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరైన వెంటనే ఫిల్టర్ బెడ్లను మరమ్మతులు చేయిస్తాం. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం.

- విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ , ఎమ్మిగనూరు

క్రికెట్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన ఎమ్మెల్యే బీవీ



సీఎం చేతుల మీదుగా కప్ అందుకుంటున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో శాసనసభ్యులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ప్రతిభను చాటారు. క్రికెట్ పోటీల్లో మంత్రి మనోహర్ టీమ్‌లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ప్రత్యర్థి టీమ్‌పై 38 పరుగులు సాధించి నాట్ అవుట్‌గా నిలిచారు. క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించి ఎమ్మెల్యే బీవీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. దీంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ నుంచి కప్ అందుకున్నారు.

మంచాలమ్మకు అభిషేకం

మంత్రాలయం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి మహా మంగళహారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

గుడికంబాలిలో ఉపాధి పనులు ప్రారంభం

కౌతాళం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడికంబాలి గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పథకాన్ని టీడీపీ నాయకులు ఉలిగయ్య, అడిగప్ప గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలు వలసలు పోకుండా గ్రామంలోని ఉపాధి పనులు చేసుకోవాలని కోరారు. ఏపీవో బజారి మాట్లాడుతూ అడిగిన వారందరికీ పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నాయకులు రేవన్న, గోపాల్ నాయక్, శ్రీనివాసులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు టీకా వేయించాలి

గోనెగండ్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు టీకాలను తప్పని సరిగా వేయించాలని రాష్ట్ర పశుసంవర్ధనశాఖ స్పెషల్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం గోనెగండ్ల మండలంలోని వీరంపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. పశువుల యజమానులతో మాట్లాడారు. పశువులకు వైద్యసేవలు సకాలంలో అందుతున్నాయా లేదా.. టీకాలు సక్రమంగా వేస్తున్నారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. టీకాలు వేయించడం వల్ల పశువులకు కలిగే లాభాలను వివరించారు. కర్నూలు జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వెంకటేశ్వర్లు, మహమ్మద్ అలీ, తిప్పనూరు సంచాలకులు విజయ్‌కుమార్, ఇస్మాయిల్, శసాద్‌బేగం, రైతులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై దాడి.. కేసు నమోదు

గోనెగండ్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామ శివార్లలో బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించి నిర్వాహకుడు వెంకటేశ్వర్లు పై కేసు నమోదు చేసినట్లు సీఐ విజయ భాస్కర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ చిన్నమరివీడు గ్రామం శివార్లలో మద్యం బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం దాడులు చేశామన్నారు. మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తుండటాన్ని గుర్తించి 50 బాటిళ్లు స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉపాధి వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుచేటు

పెద్దకడబూరు , మార్చి 21(ఆంధ్రజ్యోతి): పదివారాలైన ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన వేతనాలు చెల్లించకపోవడం సిగ్గు చేటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆదోనిలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని డివిజనల్ సర్వేయర్ వేణుకు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమంగా



సర్వేయర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కూలిలు వస్తేనే పూట గడిచే పరిస్థితులు లేవని, అటువంటిది పదివారాలుగా ఉపాధి పనులు చేసిన వేతనాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలను సకాలంలో చెల్లించి వలసలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

పాదయాత్రికులకు వైద్య శిబిరం ఏర్పాటు

గోనెగండ్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కర్ణాటక నుంచి శ్రీశైలానికి పాదయాత్ర చేపట్టిన భక్తుల కోసం గోనెగండ్లలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫార్మసిస్టు కృష్ణకుమార్, జిల్లా ఆర్ఎంపీ సంఘం నాయకులు ఉస్మాన్‌మియ్య, జీ నాగేశ్వరరెడ్డి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం శిబిరాన్ని ఎల్ఐసీ సీనియర్ బిజినేస్ అసోసియేట్ పాటిల్ తిమ్మారెడ్డి ప్రారంభించారు. ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రి నిర్మించాలి: ఏఐవైఎఫ్

మంత్రాలయం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ఇండోర్ స్టేడియం నిర్మించాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి రాజీవ్, మండలాధ్యక్ష, కార్యదర్శులు చిన్న, రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేడ్కర్ సర్కిల్ నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు జాఫర్ పటేల్ మాట్లాడుతూ నిత్యం భక్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో రద్దీగా ఉండే మంత్రాలయంలో సరైన వసతులతో కూడిన ప్రభుత్వ ఆస్పత్రి లేకపోవడం శోచనీయమన్నారు. మూడు కి.మీదూరంలో ఉన్న కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శ్రీమఠం ఆస్పత్రుల్లో సరైన సౌకర్యాలు లేవన్నారు. అత్యవసర చికిత్సలు అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ప్రతిసారి స్థలం లేదని చెబుతున్నారని, రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన స్థలం కేటాయిచాలని కోరారు.



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అదే విధంగా ఫిల్లర్లకే పరిమితమైన ఇండోర్‌స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. నాయకులు నరసింహులు, భాష, మురళి, విజయ్, ప్రానేష్, ప్రవీణ్, శ్రీశైలం, చిన్నరాజు, వినీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ ప్రయాణం కూడా పరీక్షే

• పది విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఒట్టి మాట
• ఒక ఆటోలో 28 మంది పరీక్ష కేంద్రానికి..



పదో తరగతి పరీక్ష రాసి ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

మంత్రాలయం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని వగరూరు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి దాదాపు 33 మంది పదో తరగతి విద్యార్థులు మంత్రాలయంలోని పరీక్ష కేంద్రానికి హాజరవుతున్నారు ఒకే ఆటోలో 28 మంది తమ ఊరి నుంచి పరీక్షలు రాసేందుకు వచ్చి, ఆ తర్వాత అదే ఆటోలో గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. విద్యార్థులే ఆటోను అద్దెకు మాట్లాడుకుని మంత్రాలయానికి 22 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. ఇంత మంది రద్దీతో వెళ్లే ఆటోకు ఏదైనా ప్రమాదం జరిగితే తలుచుకుంటేనే భయమేస్తుంది. బాలికలను ఆటో లోపల కూర్చుబెట్టి, డ్రైవర్ పక్కన నలుగురు, టాప్‌పైన నలుగురు, ఆటోకు అటూ ఇటూ నలుగురు, వెనుకాల ఐదుగురు చొప్పున నిల్చుండి పరీక్షలు రాయడానికి విద్యార్థులు వెళుతున్నారు. ఐదుగురు పట్టే ఆటోలో ఇంత మంది ప్రయాణించడం చూసిన వాళ్లకు.. ప్రభుత్వం చెప్పిన ఉచిత బస్సు సౌకర్యం ఏమైందనే ప్రశ్న తలెత్తక మానదు.

గుంతల రోడ్డును బాగు చేశారు..

కోసిగి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు గుంత పడి ప్రమాదకరంగా మారిందని, పొంచి ఉన్న ప్రమాదం అని ఈ నెల 19న 'ఆంధ్రజ్యోతి'లో కథనాన్ని ప్రచురించింది. ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు, ఏఈ నరేష్ స్పందించి గుంతలు పడ్డ రోడ్డుపై శుక్రవారం రాళ్లు, సిమెంటు, కంకర వేసి పూడ్చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంత పూడ్చివేయడంతో వాహనదారులు 'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డుకు మరమ్మతు చేసిన దృశ్యం

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి



సీసీ రోడ్డు పరిశీలిస్తున్న ముత్తురెడ్డి

కోసిగి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ముత్తురెడ్డి అన్నారు. శుక్రవారం కోసిగిలోని మూడో వార్డు వాల్మీకి నగర్‌లో సీసీ రోడ్డు పనులను టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ముత్తురెడ్డి మాట్లాడుతూ మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి సహకారంతో కోసిగి మండలంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ టీడీపీ నాయకులు కొండగేని పెద్ద కోసిగయ్య, పోతుల నాగరాజు, జల్లు కోసిగయ్య, తిప్పలదొడ్డి బసయ్య, శంకర్, ఆదోని మహదేవ, మల్లికార్జున ఉన్నారు.

గ్రామాల్లో అల్లర్లకు తావు ఉండొద్దు

డీఎస్పీ ఉపేంద్ర బాబు



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

మంత్రాలయం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అల్లర్లు లేకుండా అందరు కలిసిమెలసి ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని మాధవరం సంతమార్కెట్‌లో పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిఎస్పీ మాట్లాడుతూ మూడు రోజులక్రితం రచ్చుమర్రి గ్రామంలో జరిగిన చోరీ కేసును ఛేదించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్నచిన్న గలాటాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు నిత్యం అవగాహన కల్పిస్తున్న మంత్రాలయం సీఐ రామాంజులు,ఎస్సై విజయ్ కుమార్‌ను అభినందించారు. సమావేశంలో సిబ్బంది వీరేశ్, భాస్కర్, వీరేశ్, రామకృష్ణ, సోమశే ఖర్, రాఘవేంద్ర, హనుమంతులు పాల్గొన్నారు.

మండుతున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు కిలోల్లో..

పచ్చిమిర్చి	రూ. 80
టమోటా	రూ. 20
వంకాయలు	రూ. 80
బెండకాలు	రూ. 60
చెవలకాయలు	రూ. 80
అలుగడ్డలు	రూ. 80
క్యారెట్	రూ. 80
కాకరకాయలు	రూ. 80
తోటకూడ కట్టలు రెండు	రూ. 15
పాలకూరకట్టలు రెండు	రూ. 15

గోనెగండ్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఈ వేసవిలో ఎండల మండుతున్నాయి. దీనికి తోడు కూరగాయాల ధరలు కూడా జనానికి చుక్కలను చూపుతున్నాయి. సామాన్యులు కూరగాయాలు తినాలంటే ఇబ్బందులు పడాల్సివస్తుంది. వర్షాభావ పరిస్థితి, ఎండాకాలం కావడతో కూరగాయల సాగుకు నీరు అందక దిగుబడి తగ్గిపోతుంది. దీంతో పదిహేను రోజులుగా కూరగాయాలు, ఆకుకూరల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. రూ. 100 తీసుకుపోతే మూడురకాలు కూరగాయాలు కూడా చేతికి రావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలంలోని గ్రామాలు, గూడురు, బెళగల్, ప్రాంతాల రైతులు పండించిన పంటలు ఎమ్మిగనూరు మార్కెట్‌కు తరలిస్తారు. వ్యాపారులు తక్కువ ధరలకు కొని మార్కెట్‌లో ఎక్కువ ధరలకు అమ్మకాలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

